పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

# TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 741 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ శనివారం 10.10.2026 పేజీలు : 8 వెల : 4/-



## భూమిపై బెంగ వద్దు..

# సాగుకే ప్రాధాన్యం ఇవ్వండి

2లో

- ప్రకాశం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు
- 'మీ భూమి-మీ హక్కు' కింద రాజ ముద్రతో కొత్త పాస్‌బుక్‌ల పంపిణీ
- రూ.166 కోట్లతో పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్‌కు శంకుస్థాపన
- అధికారుల పనితీరుపై బహిరంగంగా సమీక్ష.. పనితీరు మెరుగుపరచు కోవాలని ఆదేశం
- బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించిన ముఖ్యమంత్రి

## అమరావతిలో చెస్ అకాడమీ..

# కోనేరు హంపికి మంత్రి లోకేశ్ హామీ

- మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయిన చెస్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి
- అమరావతిలో చెస్ అకాడమీ ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి
- హంపి ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన మంత్రి
- ప్రభుత్వపరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ
- ఒలింపియాడ్ పతకాల విజేతగా నిలిచిన హంపిని



### అభినందించిన లోకేశ్

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అంతర్జాతీయ స్థాయి చెస్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. ఈ మేరకు ప్రఖ్యాత చదరంగ క్రీడాకారిణి, గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి చేసిన విజ్ఞప్తి పట్ల రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ సానుకూలంగా స్పందించారు. అకాడమీ స్థాపనకు ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రి లోకేశ్‌తో కోనేరు హంపి, ఆమె తండ్రి అశోక్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన తరువాయి 2లో

## భారత పైలట్ స్మిత్ మచ్చర్‌కు

# ఇజ్రాయెల్ సాహస పురస్కారం

- స్మిత్ కోలుకున్నాక పురస్కారం అందిస్తానన్న అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్
- సహ పైలట్ దాడిని ఎదుర్కొని 174 మంది ప్రాణాలను కాపాడిన మచ్చర్

2లో



## అంతర్జాతీయ న్యాయపోరాటం

# నవీ పిళ్లైకు నోబెల్ శాంతి పురస్కారం

- 2026 సంవత్సరానికి నోబెల్ శాంతి పురస్కారం నవీ పిళ్లైకు ప్రకటన
- భారత సంతతికి చెందిన దక్షిణాఫ్రికా న్యాయ నిపుణురాలు నవీ పిళ్లై
- యుద్ధ నేరాలు, మానవ హక్కుల ఉల్లంఘనలపై పోరాటానికి గుర్తింపు
- రువాండా, అంతర్జాతీయ న్యాయస్థానాల్లో న్యాయమూర్తిగా కీలక పాత్ర
- అంతర్జాతీయ న్యాయ వ్యవస్థ ప్రాముఖ్యతను చాటిన నోబెల్ కమిటీ



అంతర్జాతీయ న్యాయం, మానవ హక్కుల కోసం దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న భారత సంతతి న్యాయమూర్తి నవనీతం 'నవీ' పిళ్లైను 2026 సంవత్సరానికి గాను అత్యంత తరువాయి 2లో

## 'నంబర్ వన్'

# డాక్టర్ల ప్రచారాలకు చెక్..!

- రోగులు, సెలబ్రిటీలతో ప్రచారం చేయడం కుదరదు
- నిరాధారమైన '100 శాతం నయం' వాదనలు నిషేధం
- నకిలీ ఫాలోవర్లు, రేటింగులు పెంచుకోవడం తప్పు
- ఏఐతో తప్పుడు రోగుల ప్రశంసలు సృష్టించడం కుదరదు
- ఉల్లంఘనలకు రిజిస్ట్రేషన్ నిలిపివేత వరకు చర్యలు



దేశవ్యాప్తంగా వైద్యులు, ఆసుపత్రులు, వైద్య సంస్థలు చేపట్టే ప్రకటనలు, ప్రచార కార్యక్రమాలపై జాతీయ వైద్య కమిషన్ (NMC) కఠిన నిబంధనలు విధించింది. వైద్య రంగంలో నైతిక విలువలను కాపాడటం, తప్పుదోవ పట్టించే ప్రకటనల నుంచి రోగులను రక్షించడం లక్ష్యంగా ఈ సమగ్ర మార్గదర్శకాలను అక్టోబర్ 6న జారీ చేసింది. ఈ నిబంధనలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా, వెబ్‌సైట్లు, ఇన్ఫ్లుయెన్సర్ మార్కెటింగ్, ఆర్టిఫిషియల్ తరువాయి 2లో

## మోదీ పేరిట నోయిడా ఎయిర్‌పోర్ట్..

# యోగి కేబినెట్ గ్రీన్ సిగ్నల్

- పేరుమార్పు తీర్మానానికి యోగి మంత్రివర్గం ఆమోదం
- మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితం పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్ణయం
- మోదీకి రాష్ట్రంతో ప్రత్యేక అనుబంధం ఉందన్న యోగి
- విమానాశ్రయం తొలి దశను మార్చిలో ప్రారంభించిన ప్రధాని మోదీ
- తొలి దశలో ఏడాదికి 1.2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు



ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్న జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును మార్చాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై ఈ విమానాశ్రయాన్ని 'నరేంద్ర మోదీ అంతర్జాతీయ విమానాశ్రయం'గా పిలవనున్నారు. ప్రధాని మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న తరువాయి 2లో



## సీజేఐ నిరసన సెగ

# ఢిల్లీలో రోజంతా ఇంటర్నెట్ బంద్

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ నిరసన
- ఢిల్లీలోని జన్‌పథ్ చుట్టూ 4 కి.మీ. పరిధిలో ఇంటర్నెట్ నిలిపివేత
- శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి 24 గంటల పాటు ఆంక్షలు
- టెలికం సంస్థలకు ఆదేశాలు జారీ చేసిన ఢిల్లీ పోలీసు యంత్రాంగం
- ప్రభుత్వ కఠిన చర్యలపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఈ నిర్ణయం

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ తరువాయి 2లో

## శాంతి నోబెల్ మిస్..

# ట్రంప్ అసహనం!

- నోబెల్ శాంతి పురస్కారం దక్కకపోవడంపై ట్రంప్ అసంతృప్తి
- విజేత నవీ పిళ్లైను విమర్శిస్తూ చేసిన పోస్టును రీషేర్
- దక్షిణాఫ్రికా న్యాయ నిపుణురాలు నవీ పిళ్లైకు 2026 శాంతి బహుమతి
- అంతర్జాతీయ నేరాలపై ఆమె పోరాటానికి గుర్తింపుగా పురస్కారం

2లో



# భూమిపై బెంగ వద్దు.. సాగుకే ప్రాధాన్యం ఇవ్వండి: చంద్రబాబు

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పాలన సాగిస్తామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం నర్సింగోలులో శుక్రవారం ఆయన పర్యటించి, 'మీ భూమి మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రైతు పొలంలో పంట గురించి ఆలోచించాలి గానీ, తన భూమి భద్రతపై ఆందోళన చెందకూడదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

**భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**

గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల విషయంలో జరిగిన అవకతవకలను సరిదిద్ది, రైతులకు పూర్తి భద్రత కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "మీ భూమి మీదే, హక్కు మీదే, ఆ హక్కును కాపాడే బాధ్యత మాది. అందుకే పాత పాస్‌బుక్‌లపై నాయకుల బొమ్మలు తొలగించి, ప్రభుత్వ రాజముద్రతో గ్యారెంటీ ఇస్తున్నాం" అని అన్నారు. వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 16.48 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించామని, ప్రకాశం జిల్లాలోనే 3,304 ఎకరాల భూ సమస్యలను పరిష్కరించి 7,980 కుటుంబాల ఆశలను నిజం చేశామని తెలిపారు. గర్భకండ్రిగ వంటి ఏళ్లనాటి భూములకు సైతం విముక్తి కల్పించామన్నారు. భూ రికార్డులన్నీ డిజిటలైజ్ చేసి, బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భద్రపరిచామని, రైతులు తమ ఇంటి నుంచే తమ భూమి వివరాలను ఫోన్‌లో చూసుకోవచ్చని చెప్పారు. ప్రతి నెలా 9వ తేదీన ఈ కార్యక్రమ పురోగతిని తానే స్వయంగా సమీక్షిస్తానని, అవినీతికి ఆస్కారం లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

*** ప్రాజెక్టులకు శంకుస్థాపన.. అభివృద్ధికి బాటలు**

ఈ పర్యటనలో భాగంగా, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్ నిర్మాణానికి, పాలేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాల్లోని 30,000 మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్ 1ను నీళ్లు విడుదల చేశాకే జాతికి అంకితం చేశామని, ఫేజ్ 2ను కూడా పూర్తి చేసి ఏటా నీళ్లిచ్చే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాబోయే మూడేళ్లలో రూ.36 వేల కోట్లతో 35 ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. రామాయపట్నం పోర్టును వేగంగా పూర్తి చేస్తున్నామని, బీపీసీఎల్ రూ.50 వేల కోట్ల పెట్టుబడితో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని అన్నారు. దొనకొండను కీలక పారిశ్రామిక టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.

*** వేదికపైనే 'పబ్లిక్ ఆడిట్'.. అధికారులకు చురకలు**



ఈ సభలో అందరి దృష్టినీ ఆకర్షించిన ప్రధాన ఘట్టం.. చంద్రబాబు వేదికపైనే నిర్వహించిన 'పబ్లిక్ ఆడిట్'. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను వేదికపైకి పిలిచి, ప్రజా స్పందన ఆధారంగా రూపొందించిన పనితీరు గణాంకాలను (పెర్ఫార్మెన్స్ డేటా) చదివి వినిపించారు. రాష్ట్ర సగటుతో పోలిస్తే ప్రకాశం జిల్లా, కొండేపి నియోజకవర్గం ఏయే అంశాల్లో వెనుకబడి ఉందో అంకెలతో సహా వివరించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా (7.93%), రవాణా శాఖ పన్నులు (7.32%), రీసర్వే (7.53%), అంగన్‌వాడీ సేవలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటి అంశాల్లో ప్రతికూల పనితీరుపై అధికారులను నేరుగా ప్రశ్నించారు. "మీరు సరిగా పనిచేయకపోతే ప్రజలు నన్ను నిందిస్తారు. మీవల్ల నేను మాట పడాలా? పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అదే సమయంలో గృహ నిర్మాణం (హౌసింగ్), ఇసుక సరఫరా, మత్స్యకార భరోసా వంటి అంశాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన అధికారులను అభినందించారు.

*** నాలుక చెప్పిందని కాకుండా, మంచి ఆహారం తీసుకోవాలి**

రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చంద్రబాబు తెలిపారు. ఆరోగ్యమే అసలైన సంపద అని, తాను రోజూ మూడు కోడిగుడ్లలోని తెల్లసొనతో చేసిన ఆమ్లెట్ తింటానని, అదే తన ఆరోగ్య రహస్యమని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ వంటగదినే ఔషధశాలగా మార్చుకోవాలని, నాలుక చెప్పిందని కాకుండా శరీరానికి ఏది మంచిదో అదే తినాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, సరైన సమయంలో మందులు వేసుకునేలా గుర్తుచేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

*** సంక్షేమం, రాజకీయ అంశాలపై వ్యాఖ్యలు**

ఎన్డీఏ ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ వేగంతో పనిచేస్తోందని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి ట్రిబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాన్ని మరింత వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలైన పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏటా మూడు ఉచిత సిలిండర్లు, అన్నదాత సుఖీభవ వంటివి విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ, తాము 34 శాతానికి పెంచితే, ప్రత్యర్థులు కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారని ఆరోపించారు. కోర్టు తీర్పు ఎలా ఉన్నా, పార్టీపరంగా 34 శాతం కంటే ఎక్కువ సీట్లు బీసీలకు ఇచ్చి వారి రాజకీయ ఎదుగుదలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

**నేను నీతిమంతుడిగా ఉంటే సరిపోదు**

నీతివంతమైన రాజకీయాలు చేయడమే తన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "నేను నీతివంతుడిగా ఉంటే సరిపోదు, నా కింద పనిచేసే అధికార యంత్రాంగం, రాజకీయ నాయకులు కూడా అవినీతికి దూరంగా ఉండాలి. చిత్రగుప్తుడిలా అందరి ఖాతాలను రాసుకుంటున్నాను. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎవరినైనా ఉపేక్షించేది లేదు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగితే ఎవరికీ తెలియదనుకోవడం భ్రమ. నేను 360 డిగ్రీల కోణంలో అందరినీ గమనిస్తున్నాను" అని హెచ్చరించారు. ప్రజాసేవకుడిగా ప్రజల బాగోగులే తనకు ముఖ్యమని, దేశభక్తిని, రాష్ట్రంపై అభిమానాన్ని పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని కోరారు. అంతిమంగా, ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడమే తన ఆశయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

## అంతర్జాతీయ న్యాయపోరాటం
# నవీ పిళ్ళైకు నోబెల్ శాంతి పురస్కారం

అంతర్జాతీయ న్యాయం, మానవ హక్కుల కోసం దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న భారత సంతతి న్యాయమూర్తి నవనీతం 'నవీ' పిళ్ళైను 2026 సంవత్సరానికి గాను అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి పురస్కారం వరించింది. యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాలు, జాతి నిర్మూలన వంటి తీవ్రమైన అంశాలపై నేరస్థులను చట్టం ముందు నిలబెట్టేందుకు ఆమె చేసిన విశేష కృషికి గుర్తింపుగా నార్వేజియన్ నోబెల్ కమిటీ శుక్రవారం ఈ ప్రకటన చేసింది. అసాధారణమైన ధైర్యం, నైతిక నిబద్ధతతో ప్రపంచ న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆమె పోషించిన పాత్రను కమిటీ కొనియాడింది. దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో వర్ణవివక్ష పాలనలో మగ్గుతున్న ఒక భారత తమిళ మూలాలు ఉన్న కుటుంబంలో నవీ పిళ్ళై జన్మించారు. సమాజంలో పాతుకుపోయిన తీవ్రమైన వివక్ష, వేర్పాటువాదాన్ని ధైర్యంగా ఎదుర్కొంటూ న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. వర్ణవివక్షకు వ్యతిరేకంగా గళమెత్తిన నెల్సన్ మండేలా వంటి ఎందరో ఉద్యమకారులకు ఆమె న్యాయవాదిగా అండగా నిలిచారు. తన సుదీర్ఘ కెరీర్‌లో ఆమె దక్షిణాఫ్రికా హైకోర్టు న్యాయమూర్తిగా, రువాండా అంతర్జాతీయ క్రిమినల్ ట్రైబ్యునల్ (ICTR), అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ICC) న్యాయమూర్తిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గానూ సేవలందించారు. ఇటీవల వరకు ఆక్రమిత పాలస్తీనా భూభాగంపై యూఎన్ ఏర్పాటు చేసిన స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కమిషన్‌కు అధ్యక్షత వహించారు. ప్రస్తుతం ఆమె మయన్మార్‌పై నమోదైన జాతి నిర్మూలన కేసులో అంతర్జాతీయ న్యాయస్థానం (ICJ)లో న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు. రువాండా ట్రైబ్యునల్‌లో నవీ పిళ్ళై పాత్ర చరిత్రాత్మకమైనది. అత్యాచారం, లైంగిక హింసను కేవలం సాధారణ నేరాలుగా కాకుండా, మానవత్వానికి వ్యతిరేక నేరాలుగా, జాతి నిర్మూలన చర్యగా పరిగణించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. కేవలం విద్వేషపూరిత ప్రచారం ద్వారా జాతి నిర్మూలనకు ప్రేరేపించారన్న ఆరోపణలపై ఒక నిందితుడిపై విచారణ జరగడంలోనూ ఆమె ప్రభావం ఉంది. ఇది అంతర్జాతీయ న్యాయ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిపోయింది. ప్రపంచంలో యుద్ధాలు, ఘర్షణలు పెరిగిపోతున్నాయని, అంతర్జాతీయ చట్టబద్ధ పాలన తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోందని నోబెల్ కమిటీ తన ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. అధికార రాజకీయాల ప్రాబల్యం పెరిగి, న్యాయ వ్యవస్థలు బలహీనపడుతున్నాయని పేర్కొంది. ఇలాంటి క్లిష్ట సమయంలో, శాంతికి న్యాయమే పునాది అని, అరాచకం, అధికార దర్పం మధ్య న్యాయాన్ని కాపాడే న్యాయమూర్తుల పాత్ర అత్యంత కీలకమని నొక్కి చెప్పింది. నవీ పిళ్ళై వంటి ధైర్యవంతులు దేశాలను, నాయకులను జవాబుదారీగా నిలబెడుతూ, హింస బాధితులకు ఆశాకిరణంగా నిలుస్తున్నారని ప్రశంసించింది. ఆమె నిబద్ధత, స్వాతంత్ర్యం, అపారమైన అనుభవం ఆమెను మన కాలంలోని అత్యంత గౌరవనీయమైన అంతర్జాతీయ న్యాయవేత్తలలో ఒకరిగా నిలబెట్టాయని కమిటీ పేర్కొంది.

# శాంతి నోబెల్ మిస్.. ట్రంప్ అసహనం!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నోబెల్ శాంతి బహుమతిని ఆశించి మరోసారి భంగపడ్డారు. తాను ఆశించిన 2026 నోబెల్ శాంతి పురస్కారం దక్కకపోవడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ ఏడాది విజేతగా నిలిచిన దక్షిణాఫ్రికా మానవ హక్కుల న్యాయ నిపుణురాలు నవీ పిళ్ళైతో పాటు, అవార్డును ప్రకటించిన నార్వేజియన్ నోబెల్ కమిటీని విమర్శిస్తూ చేసిన ఒక పోస్టును ఆయన తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో రీషేర్ చేశారు. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతి ప్రకటన వెలువడిన కొద్ది గంటలకే ట్రంప్ ఈ మేరకు స్పందించారు. తన మాజీ న్యాయవాది డేవిడ్ షోయెన్ చేసిన ఒక పోస్టును ఆయన పంచుకున్నారు. "ఐక్యరాజ్యసమితికి చెందిన నవీ పిళ్ళైకు ఈ పురస్కారాన్ని అందజేయడం ద్వారా నోబెల్ కమిటీ కోలుకోలేని విధంగా అవమానానికి గురైంది. ఒకప్పుడు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ శాంతి బహుమతి విలువను ఇది తగ్గించింది" అని ఆ పోస్టులో పేర్కొన్నారు. నవీ పిళ్ళై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలను తీవ్రంగా ద్వేషిస్తారని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ హమాస్‌కు అండగా నిలిచారని అందులో ఆరోపించారు. గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడిందని ఆమె నేతృత్వంలోని ఐరాస కమిషన్ నివేదించడాన్ని ఒక "ప్రహసనం"గా అభివర్ణించారు. అదే సమయంలో, అబ్రహాం ఒప్పందాలు, బందీల విడుదల, రష్యా-ఉక్రెయిన్ యుద్ధ నివారణకు ట్రంప్ చేసిన కృషిని కొనియాడుతూ, ఆయనకే నోబెల్ దక్కాలని ఆ పోస్టులో పేర్కొన్నారు. మరోవైపు, 2026 సంవత్సరానికి గాను నోబెల్ శాంతి బహుమతిని దక్షిణాఫ్రికాకు చెందిన 85 ఏళ్ల నవీ పిళ్ళైకు నార్వేజియన్ నోబెల్ కమిటీ ప్రకటించింది. యుద్ధ నేరాలు, మారణహోమాలు, మానవ హక్కుల ఉల్లంఘనలకు బాధ్యులైన వారిని గుర్తించి, చట్టానికి కట్టబెట్టడంలో ఆమె చేసిన సుదీర్ఘ పోరాటానికి ఈ గుర్తింపు దక్కినట్లు కమిటీ తెలిపింది. గతంలో ఆమె ఐరాస మానవ హక్కుల హైకమిషనర్‌గా, అంతర్జాతీయ న్యాయస్థానం న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ అవార్డు విషయం తెలిసే సమయానికి నవీ పిళ్ళై జర్మనీలోని న్యూరెమ్‌బర్గ్ కోర్టులో ఒక కార్యక్రమంలో ఉన్నారు. ఈ వార్త తెలియగానే ఆమె చమత్కరిస్తూ, "మీరు ఇంకాస్త గట్టిగా చప్పట్లు కొడితే, ఈ బహుమతిని నేను ట్రంప్‌తో పంచుకుంటా" అని వ్యాఖ్యానించడంతో అక్కడ నవ్వులు పూశాయి. ట్రంప్ చాలాకాలంగా నోబెల్ శాంతి బహుమతిని ఆశిస్తున్నారు. ఈ ఏడాది పాకిస్థాన్ ప్రధాని ఆయన పేరును నామినేట్ కూడా చేశారు.

# సీజేఐ నిరసన సెగ: ఢిల్లీలో రోజంతా ఇంటర్నెట్ బంద్

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) రేపు తలపెట్టిన నిరసన కార్యక్రమం దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఢిల్లీ పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా కఠిన ఆంక్షలు విధించారు. జన్‌పథ్ కర్తవ్య పథ్ కూడలికి నాలుగు కిలోమీటర్ల పరిధిలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను 24 గంటల పాటు నిలిపివేయాలని శుక్రవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్ 9, శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి శనివారం రాత్రి 10 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. ఈ మేరకు ఢిల్లీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయం నుంచి ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా, జియో, ఎంటీఎన్ఎల్ వంటి ప్రధాన టెలికం సంస్థలకు అధికారిక ఉత్తర్వులు వెళ్లాయి. టెలికమ్యూనికేషన్స్ చట్టం 2023లోని నిబంధనల ప్రకారం ఇంటర్నెట్ సేవలను నిలిపివేయాలన్న తాము కోరిన విన్నపాన్ని కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఆమోదించినట్లు పోలీసులు తమ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అన్ని రకాల సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మొబైల్ ఇంటర్నెట్ సేవలను తక్షణమే నిలిపివేయాలని ఆయా సంస్థలను ఆదేశించారు. కాగా, ఈ పరిణామం చోటుచేసుకోవడానికి కొన్ని గంటల ముందే నిరసనల అణిచివేతకు ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలోకి వచ్చే మెట్రోలు, రైళ్లపై ఆంక్షలు విధించడాన్ని ప్రశ్నిస్తూ, "ఈగను చంపడానికి సుత్తిని ఉపయోగించలేరు కదా" అని ప్రభుత్వాన్ని నిలదీసింది. అత్యున్నత న్యాయస్థానం ఇటువంటి వ్యాఖ్యలు చేసినప్పటికీ, పోలీసులు నిరసనలను అడ్డుకోవడానికి ఇంటర్నెట్ సేవలపై నిషేధం విధించడం గమనార్హం. సీజేపీ నిరసనల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

# మోదీ పేరిట నోయిడా ఎయిర్‌పోర్ట్.. యోగి కేబినెట్ గ్రీన్ సిగ్నల్

ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్న జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును మార్చాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై ఈ విమానాశ్రయాన్ని 'నరేంద్ర మోదీ అంతర్జాతీయ విమానాశ్రయం'గా పిలవనున్నారు. ప్రధాని మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గం తీర్మానాన్ని ఆమోదించిందని తెలిపారు. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మొత్తం 39 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అనంతరం మీడియాతో మాట్లాడిన యోగి.. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌తో ప్రధానికి ప్రత్యేక అనుబంధం ఉందని, వారణాసి నుంచి ఎంపీగా ఎన్నికైన ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతోందని చెప్పారు. 2017కు ముందు రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు అంతంతమాత్రంగానే ఉండేవని యోగి పేర్కొన్నారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్‌వేలు, జాతీయ రహదారులు, మెట్రో, రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థలతో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగయ్యాయని తెలిపారు. అయోధ్య రామమందిర నిర్మాణం, కాశీ విశ్వనాథ్ కారిడార్ అభివృద్ధి వంటి కార్యక్రమాలను కూడా ప్రస్తావించారు. జెవార్‌లో నిర్మిస్తున్న నోయిడా విమానాశ్రయం ఉత్తర్‌ప్రదేశ్‌కు అందించిన గొప్ప బహుమతిగా యోగి అభివర్ణించారు. ఇది భవిష్యత్తులో దేశంలోనే కీలక విమానయాన కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విమానాశ్రయం తొలి దశను ప్రధాని మోదీ ఈ ఏడాది మార్చిలో ప్రారంభించారు. మొదటి దశలో ఏడాదికి సుమారు 1.2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యం ఉండనుంది. నాలుగు దశల నిర్మాణం పూర్తయితే ఆసియాలోనే అతిపెద్ద విమానాశ్రయాల్లో ఒకటిగా నిలవనుంది.

# అమరావతిలో చెస్ అకాడమీ.. కోనేరు హంపికి మంత్రి లోకేశ్ హామీ

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అంతర్జాతీయ స్థాయి చెస్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. ఈ మేరకు ప్రఖ్యాత చదరంగ క్రీడాకారిణి, గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి చేసిన విజ్ఞప్తి పట్ల రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ సానుకూలంగా స్పందించారు. అకాడమీ స్థాపనకు ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రి లోకేశ్‌తో కోనేరు హంపి, ఆమె తండ్రి అశోక్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన హంపిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ టోర్నీలో భారత మహిళల జట్టు కాంస్య పతకం సాధించడంలోనూ, వ్యక్తిగత విభాగంలో బోర్డు 1పై కాంస్యం గెలవడంలోనూ హంపి పోషించిన కీలక పాత్రను ఆయన ప్రశంసించారు. భవిష్యత్ తరం క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో అమరావతిలో ఒక ప్రత్యేక చెస్ అకాడమీని ఏర్పాటు చేయాలన్న తన ఆకాంక్షను హంపి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ బృహత్కార్యానికి ప్రభుత్వం మద్దతుగా నిలవాలని ఆమె కోరారు.

# 'నంబర్ వన్' డాక్టర్ల ప్రచారాలకు చెక్!

దేశవ్యాప్తంగా వైద్యులు, ఆసుపత్రులు, వైద్య సంస్థలు చేపట్టే ప్రకటనలు, ప్రచార కార్యక్రమాలపై జాతీయ వైద్య కమిషన్ కఠిన నిబంధనలు విధించింది. వైద్య రంగంలో నైతిక విలువలను కాపాడటం, తప్పుదోవ పట్టించే ప్రకటనల నుంచి రోగులను రక్షించడం లక్ష్యంగా ఈ సమగ్ర మార్గదర్శకాలను అక్టోబర్ 6న జారీ చేసింది. ఈ నిబంధనలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా, వెబ్‌సైట్లు, ఇన్ఫ్లుయెన్సర్ మార్కెటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా చేసే ప్రచారాలకు కూడా వర్తిస్తాయి. కొత్త నిబంధనల ప్రకారం, వైద్యులు లేదా ఆసుపత్రులు తమ సేవలను ప్రమోట్ చేసుకునేందుకు రోగుల టెస్టిమోనియల్స్ (అనుభవాలు), సెలబ్రిటీల సిఫార్సులు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల ప్రచారాలు, చివరికి తమ ఉద్యోగుల అభిప్రాయాలను కూడా ఉపయోగించకూడదు. ప్రచార ఉద్దేశంతో రోగుల నుంచి ప్రత్యేకంగా రివ్యూలు సేకరించడంపై కూడా నిషేధం విధించారు. "నెం.1 స్పెషలిస్ట్", "బెస్ట్ డాక్టర్", "ప్రముఖ నిపుణులు" వంటి బిరుదులను ప్రకటనల్లో వాడాలంటే, అందుకు కచ్చితమైన, నిరూపించగల ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. అదేవిధంగా, "100% సక్సెస్", "గ్యారెంటీ క్యూర్", "అద్భుత చికిత్స", "నొప్పి లేని వైద్యం" వంటి వాగ్దానాలను సరైన శాస్త్రీయ ఆధారాలు లేకుండా ప్రచారం చేయకూడదని జాతీయ వైద్య కమిషన్ స్పష్టం చేసింది.

**డిజిటల్ ప్రచారాలపై ప్రత్యేక దృష్టి**

మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ మాధ్యమాల్లో ప్రచారాలపై కూడా జాతీయ వైద్య కమిషన్ ప్రత్యేక ఆంక్షలు విధించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సృష్టించిన నకిలీ రోగుల టెస్టిమోనియల్స్, తప్పుడు చికిత్సా ఫలితాలు, మోసపూరిత ప్రచార మెటీరియల్‌ను వాడటాన్ని నిషేధించింది. అయితే, ఆరోగ్య సంరక్షణ సమాచార వ్యాప్తిలో ఏఐ వాడకంపై ఇది పూర్తి నిషేధం కాదని పేర్కొంది.

## సంపాదకీయం

# కమిషనర్ల రాజీనామాలు
# ఎన్నికల వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు

భారతీయ జనతా పార్టీ ప్రభ తరిగిపోతున్నది. మన దగ్గర శుక్రమహాదశ అంటారు. రికార్డులు బద్దలు కొట్టవలసినవి చాలా ఉన్నాయి. నెహ్రూ గారు పరిపాలించినన్ని రోజులు పరిపాలించవలసి ఉన్నది. ఎన్నికల ద్వారా వచ్చిన ప్రధానమంత్రిగా ఎక్కువ రోజులు పరిపాలించిన ప్రధానమంత్రిగా వేనోళ్ల కీర్తించబడ్డారు. అయితే నెహ్రూ గారు ఎన్నికలను ఎదుర్కోలేదు; ఏదో నామినేటెడ్ ప్రధానమంత్రిగా వచ్చారనే భ్రమలోకి ప్రజలను తీసుకెళ్లారు. అప్పటి ఎన్నికల ప్రక్రియలో తేడా మాత్రమే ఉన్నది. అయితే నెహ్రూ గారు వ్యవస్థాగతంగా అప్పడప్పడే బలపడుతున్న తరుణంలో ఎన్నికలు జరిపించగలిగారు. కానీ ఇప్పుడు, ఎన్నో దశాబ్దాలు గడిచాక, సాంకేతికతను ఇంతగా సాధించాక మన ఎన్నికల వ్యవస్థే ప్రపంచానికి భారత ప్రజాస్వామ్యం పట్ల సందేహాన్ని రేకెత్తించింది. అందుకే ఆందోళనలు తారాస్థాయిలో జరుగుతున్నాయి. ఈ ఆందోళనలను కాంగ్రెస్ తన రాజకీయ వ్యూహానికి ఉపయోగించుకునే అవకాశం కనిపిస్తున్నది. అయితే కేంద్రంలో పెద్దలు మాత్రం దేశ పరువు ప్రతిష్ఠల కంటే తమ పంతమే గొప్పదిగా భావిస్తున్నారు. రోజురోజుకూ తీవ్రమవుతున్న సమస్యను పరిష్కరించే దిశగా ఒక్క అడుగు కూడా వేయడం లేదు; వేసే ఉద్దేశం కూడా లేదు. రాహుల్ గాంధీ, ప్రియాంక వాద్రా, కాంగ్రెస్ అగ్రనాయకత్వం అంతా కదిలివచ్చింది. మూడు వందల మంది పార్లమెంటు సభ్యులు ప్రభుత్వానికి తమ నిరసన గళం వినిపిస్తూ ఆందోళనను ఒక స్థాయికి తీసుకెళ్లారు. ఇండియా కూటమిలో ఎన్ని విభేదాలు ఉన్నా సమయం వచ్చినప్పుడు కలిసి ఉంటాము అనే సంకేతాన్ని ఇవ్వడం దేశ ప్రజలకు ఒక భరోసాను కల్పించిందనే చెప్పాలి. ప్రపంచం దృష్టి అంతా ఇప్పుడు భారత ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయం కోసమే ఎదురుచూస్తున్నది. అయితే ఈ సమస్య ఒక్క జ్ఞానేష్ కుమార్ రాజీనామా చుట్టూనే తిరుగుతున్నది. జ్ఞానేష్ కుమార్ రాజీనామా అనేది ఒక వ్యక్తిని మార్చడమే కానీ, అంతకు మించి మరొకటి కాదు. ఒక వ్యక్తి వ్యవస్థను శాసించే స్థాయికి ఎదగడం ఎలా సాధ్యపడింది? ఎవరి సహకారంతో కోట్లాది మంది హక్కును ప్రశ్నార్థకం చేయగలిగారు అనేది ప్రశ్న.; అలాగే దాని వెనుక ఉన్న తంత్రం ప్రధానం. 2024 సాధారణ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ ఊహించని ఫలితాలు వచ్చిన తరువాత సర్ ప్రక్రియ ప్రారంభం అయింది. బీహార్‌లో 2020 శాసనసభ ఎన్నికలలో ఎన్డీయేకు 37.2 శాతం ఓటింగ్ ఉండగా, 2025 శాసనసభ ఎన్నికలలో 47.5 శాతం సాధించింది. పశ్చిమ బెంగాల్‌లో కూడా అదే పరిస్థితి. 2024 ఎన్నికలలో బీజేపీకి వచ్చిన ఫలితానికి, తరువాత శాసనసభ ఎన్నికలలో బీజేపీ సాగించిన జైత్రయాత్రకు సంబంధం లేదు. దక్షిణ భారతదేశంలో వచ్చిన ఫలితాలు చెప్పకోవడం అనవసరం. తెలంగాణ, కర్ణాటక లలో సాధారణ ఎన్నికల కంటే ముందే శాసనసభ ఎన్నికలు జరిగినవి. కేరళలో బీజేపీ ఉనికి మొదలయిందే ఈ మధ్య. అందుకని ఎన్డీయే పక్షాలు చెప్పే కాంగ్రెస్ కొన్ని రాష్ట్రాలలో గెలిచింది కదా అనే వాదనకు అర్థం లేదు. దేశంలో ఎన్నికల కమిషనర్ల పనితీరు వివాదాస్పదం అవ్వడం కొత్త కాదు. అయితే వివాదాలన్నీ ఎన్డీయే హయాంలోనే జరగడం గమనార్హం. స్వాతంత్ర్యానంతరం దాదాపు 70 సంవత్సరాల పాటు ఎన్నికల కమిషనర్ల నియామకాలు, విరమణలు ఒక నిలకడైన పద్ధతిలో సాగాయి. ఈ మధ్య కాలంలోనే వరుసగా ఇద్దరు ఎన్నికల కమిషనర్ల రాజీనామాలు, కమిషనర్ల మధ్య అంతర్గత విభేదాలు బట్టబయలయ్యాయి. భారత ఎన్నికల కమిషన్ చరిత్రలో ఒక ఎన్నికల కమిషనర్ తన పదవీకాలం ముగియకుండా స్వచ్ఛందంగా రాజీనామా చేయడం అరుదు. ఎన్డీయే ప్రభుత్వం రాకముందు 1950 నుండి 2014 మధ్యకాలంలో ఎన్నికల కమిషనర్ రాజీనామా ఒక్కసారి మాత్రమే జరిగింది. అది కూడా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం వలన జరిగింది. 1989 లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని ముగ్గురు సభ్యుల కమిషన్‌గా మార్చింది. తదుపరి వచ్చిన నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం 1990 లో అదనపు కమిషనర్ల పోస్టులను రద్దు చేసినందువలన అప్పటి అదనపు కమిషనర్ ధనోవాను తొలగించవలసి వచ్చింది. అది రాజీనామా కాక ప్రభుత్వం తొలగించిన కారణంగా ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పీవీ నరసింహారావు ప్రభుత్వం మళ్లీ ఎన్నికల సంఘాన్ని ముగ్గురు సభ్యుల కమిషన్‌గా మార్చింది. ఎన్డీయే హయాంలో మాత్రం ఇద్దరు ఎన్నికల కమిషనర్లు రాజీనామా చేశారు. అందులో అశోక్ లావాసా రాజీనామా స్వచ్ఛందంగా చేశారు అని ప్రభుత్వం చెబుతుంది. ఆయన రాజీనామా చేయడానికి ముందు ఆయనపై, ఆయన కుటుంబంపై జరిగిన దాడులు గమనిస్తే అది స్వచ్ఛందమో కాదో అర్థం అవుతుంది. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో భారత ఎన్నికల కమిషనర్లలో ఒకరైన అశోక్ లావాసా చుట్టూ తిరిగిన వివాదం, ఆ తరువాత ఆయన కుటుంబంపై జరిగిన తనిఖీలు తీవ్ర రాజకీయ చర్చకు దారితీశాయి. 2019 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోదీ, అమిత్ షా లు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని ప్రతిపక్షాలు ఫిర్యాదు చేశాయి. ఆ ఫిర్యాదులను విచారించిన ముగ్గురు సభ్యుల ఎన్నికల కమిషన్ వారిద్దరికీ క్లీన్ చిట్ ఇచ్చింది. అయితే ఈ నిర్ణయాలతో ఏకీభవించని అశోక్ లావాసా తన భిన్నాభిప్రాయాన్ని రికార్డ్ చేయాలని పట్టుబట్టారు. కమిషన్ అందుకు అంగీకరించలేదు. అందుకు నిరసనగా ఆయన ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించిన కమిషన్ సమావేశాలకు హాజరవ్వడం మానివేశారు. ఆయన ప్రవర్తన ఎన్నికల సంఘంలో ఉన్న అంతర్గత విభేదాలను బట్టబయలు చేసింది. పొమ్మనలేక పొగబెట్టినట్లు ఆయన రాజీనామాను నేరుగా కోరకుండా ఒత్తిడి పెంచారు. ఎన్నికల వివాదం ముగిసిన తరువాత కేంద్ర ప్రభుత్వ పంజరంలోని చిలుకలైన ఐటీ, ఈడీలు రంగప్రవేశం చేసి లావాసా భార్య, సోదరీమణుల పైన ఐటీ దాడులు చేశాయి. ఆయన కుమారుడు అబీర్ లావాసా నడుపుతున్న నరీష్ ఆర్గానిక్ ఫుడ్స్ అనే సంస్థలోకి విదేశీ నిధులు వచ్చిన తీరుపై ఈడీ దృష్టి సారించింది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలతో కుటుంబాన్ని ఉక్కిరిబిక్కిరి చేశారు. ఆఖరుకు ఆయన శ్రీమతి హర్యానాలో ఒక ఆస్తి కొనుగోలు చేసిన వ్యవహారంలో స్టాంప్ డ్యూటీ ఎగవేశారని ఆరోపించారు. తరువాత హర్యానా ప్రభుత్వం ఆమెకు క్లీన్ చిట్ ఇచ్చింది. ఆయన ప్రధాని, అమిత్ షాల వ్యవహారంలో స్వతంత్రంగా వ్యవహరించినందుకే కేంద్ర ప్రభుత్వం విచారణ సంస్థలను ప్రయోగించిందని ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోశాయి. అంత ఒత్తిడి తట్టుకోలేక 2020 లో ఆయన రాజీనామా చేశారు. సీనియారిటీ ప్రకారం ఆయన 2021 లో ప్రధాన ఎన్నికల కమిషనర్ అయ్యుండేవారు. ఇది ఎంతో బాధాకరమైన పదవీ విరమణ. మరో కమిషనర్ అరుణ్ గోయల్ 2024 సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ రావడానికి వారం రోజుల ముందు తన పదవీకాలం 2027 వరకు ఉన్నప్పటికీ రాజీనామా చేశారు. అందుకు కారణాలు అంతర్గత విభేదాలు. రాజీనామా చేయకపోతే అశోక్ లావాసాకు పట్టిన గతే పడుతుందనే భయంతో ఆయనే రాజీనామా చేశారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఉపన్యాసం ఇవ్వడం తప్పితే సమాధానం చెప్పే అలవాటు ప్రధానికి లేదు కాబట్టి సమాధానం చెప్పలేదు. ఈ ఉదంతాలు గమనించిన ఎవరికైనా ఎన్డీయే ప్రభుత్వం వ్యవస్థలను లొంగదీయడానికి వ్యవస్థలనే ఎంత క్రూరంగా ఉపయోగిస్తుందో అర్థమవుతుంది. ఈ దేశంలో వ్యవస్థలను రాజకీయాల కోసం ఉపయోగించుకోవడం కొత్త కాదు. ఇందిరా గాంధీ హయాం నుండి కళ్లకు కనిపించే విధంగా జరుగుతూనే ఉన్నది; కాకపోతే ఇంత తెగింపు ధోరణి కాదు. పది సంవత్సరాల నుండి ఇది మరీ పెరిగిపోయింది. జాతీయ స్థాయి నాయకులు కూడా భయపడే స్థాయిలో వ్యవస్థలు పనిచేస్తున్నాయి. ఇప్పుడు జరుగుతున్న ఆందోళనల్లో ప్రధానమైన డిమాండ్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా. ఇక్కడ గమనించవలసింది; పదమూడు కోట్ల ఓట్లను కాదు, మరో పదమూడు కోట్ల ఓట్లను తొలగించినా, ఫార్మ్ 6 లో ఎన్ని మార్పులు చేసినా జ్ఞానేష్ కుమార్‌కు వ్యక్తిగతంగా ఒరిగేది ఏమీ లేదు. మహా అయితే ఆయనొక గౌరవనీయమైన పదవిలో అగౌరవంగా కొనసాగుతారు. వారింట్లో ఉన్న ఐఏఎస్ అధికారులకు మంచి పోస్టులుగా వారు భావించేవి దక్కుతాయి. రాళ్ల దెబ్బలు తినేది ఒకరు, ఫలితాలను అనుభవించేది మరొకరు. ఇటువంటి పరిస్థితి పదేపదే రాకుండా ఉండాలంటే ఎన్నికల వ్యవస్థను తాము లాభపడే దిశగా మలచుకోవాలనుకునే శక్తులను అడ్డుకోవడానికి దేశంలో ఉన్న రాజకీయ పార్టీలు, ప్రజాస్వామికవాదులు ఏకం కావాలి. ప్రస్తుతానికి ఆందోళనల్లో ముందు వరుసలో నిలబడే ప్రయత్నం చేస్తున్న రాహుల్, ప్రియాంకలు భవిష్యత్తులో తాము గద్దెనెక్కితే ఎలక్షన్ కమిషన్‌ను ప్రజలకు జవాబుదారీ వ్యవస్థగా ఎలా రూపొందిస్తారో వివరించాలి. ఒక్క ఎలక్షన్ కమిషన్ మాత్రమే కాదు, దేశంలో ఉన్న వ్యవస్థలన్నింటి స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుతామని, అందుకు అవసరమైన కార్యాచరణను కూడా ప్రజలకు ఇప్పడే తెలియజేయాలి.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### అక్టోబర్ 10

OCTOBER 10

* ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం
* 680: ముహమ్మద్ ప్రవక్త మనుమడు హుసేన్ ఇబ్న్ అలీ ఇబ్న్ అబీతాలిబ్ మరణం (జ.626).
* 1731: బ్రిటిష్ తత్వవేత్త, శాస్త్రవేత్త హెన్రీ కేవిండిష్ జననం (మ.1810).
* 1906: భారతీయ రచయిత ఆర్.కే. నారాయణ్ జననం (మ.2001). (చిత్రంలో)
* 1908: అన్ని పాత్రలలో రాణించిన అద్భుతమైన సహాయ నటుడు ముదిగొండ లింగమూర్తి జననం (మ.1980).
* 1960: తెలుగు సినిమా ప్రతినాయకుడు, హాస్యనటుడు రఘు బాబు జననం.
* 1973: భారతీయ సినీ దర్శకుడు ఎస్. ఎస్. రాజమౌళి జననం.
* 1990: వరంగల్లు సమీపంలో ఒక రైలు బోగీకి నక్సలైట్లు నిప్పంటించిన సంఘటనలో 60 మందికి పైగా మరణించారు.
* 2011: భారతీయ గజల్ గాయకుడు జగ్జీత్ సింగ్ మరణం (జ.1941).


ఆర్. కె. నారాయణ్

## జగన్‌కు వచ్చే క్రిమినల్ ఆలోచనలు
# ఎవరికీ రావు

**: రామ్మోహన్ నాయుడు**

శ్రీకాకుళం: స్థానిక ఎన్నికలు జరగకుండా అడ్డుకోవాలన్నదే వైకాపా కుట్ర అని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆక్షేపించారు. 24 శాతం ఉన్న రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతూ ఇచ్చిన జీవోను హైకోర్టు కొట్టేసిన తర్వాతే.. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లినట్లు చెప్పారు. బీసీలకు సామాజిక న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. శ్రీకాకుళంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్నికలు నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ నిధులను తీసుకొచ్చి గ్రామాలను అభివృద్ధి చేయాలన్నదే చంద్రబాబు సంకల్పమని, దానికి జగన్ మోహన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని అన్నారు. జగన్‌కు వచ్చే క్రిమినల్ ఆలోచనలు ఎవరికీ రావని మండిపడ్డారు. బీసీలను సొంత బిడ్డల్లా చూసుకునే పార్టీ తెదేపా అని తెలిపారు.



*** బలహీనవర్గాలపై వైకాపా కక్ష: అచ్చెన్నాయుడు**

బలహీనవర్గాలపై వైకాపా కక్ష కట్టిందని ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. 1985లో ఎన్టీఆర్ తొలిసారి బీసీలకు 20శాతం రిజర్వేషన్లు ఇచ్చారని గుర్తు చేశారు. ఆ తర్వాత ఆ రిజర్వేషన్లను 34శాతానికి పెంచిన ఘనత చంద్రబాబుదేనని చెప్పారు. గతంలో వైఎస్ఆర్, కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా 34 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు జరిపారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాకే 24శాతంతో స్థానిక ఎన్నికలకు వెళ్లారని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లను ఎందుకు తగ్గించారో వైకాపా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ''పాత చట్టాన్ని రద్దు చేయకుండానే మీరు రిజర్వేషన్లు ఎందుకు తగ్గించారు. సుప్రీం కోర్టు కొట్టేస్తుందని తెలిసే రిజర్వేషన్లు పెంచామని దుష్ప్రచారం చేస్తున్నారు. హైకోర్టు తీర్పుపై మీరు సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లలేదు?'' అని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు.

## గెజిట్ విడుదలైన తర్వాతే ఎన్నికల నోటిఫికేషన్

**: ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా**

విజయవాడ: రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాతే స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. నోటిఫికేషన్ విడుదల సమయానికి రాష్ట్రంలో 'సర్' ప్రక్రియ పూర్తయితే.. కొత్త ఓటర్ల జాబితాతో ఎన్నికలు నిర్వహిస్తామని, లేదంటే.. ప్రస్తుత ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. రిజర్వేషన్లు ఖరారైన తర్వాత రాజకీయ పార్టీలతో సమావేశం



ఏర్పాటు చేసి, ఆ తర్వాత నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు చెప్పారు.

## బీసీలకు 34 శాతం
# రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం

**: మంత్రి పార్థసారథి**



అమరావతి: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని మంత్రి పార్థసారథి తెలిపారు. చట్టపరంగా ఇబ్బందులు ఎదురైనా తెదేపా పరంగా బీసీలకు సముచిత రాజకీయ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో పార్థసారథి మీడియాతో మాట్లాడారు. ''బీసీ రిజర్వేషన్ల విషయంలో న్యాయపరంగా ముందుకెళ్లాలని సుప్రీంకోర్టు చెప్పింది. రిజర్వేషన్లు ఇవ్వొద్దని చెప్పలేదు. స్థానిక ఎన్నికలు నిర్వహించకపోతే కేంద్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోతాయి. బీసీ గణనను త్వరగా పూర్తిచేసి ఆమోదించి రిజర్వేషన్లు కల్పిస్తాం. ప్రజాస్వామ్యంపై నమ్మకం లేని పార్టీ వైకాపా. ఆ పార్టీ ఎమ్మెల్యేలు గత రెండున్నరేళ్లలో అసెంబ్లీకి వచ్చి ప్రజాసమస్యలపై మాట్లాడలేదు. ఎన్నికలపైనా ఆ పార్టీకి గౌరవం లేదు'' అని పార్థసారథి విమర్శించారు.

# జనసేన ఎమ్మెల్యే బాలరాజుపై పవన్ కల్యాణ్ సీరియస్.. విచారణకు కమిటీ

- **పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై విచారణకు కమిటీ**
- **జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు జారీ**
- **బాలరాజు వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తితో ఉన్న పవన్**
- **గతంలో హెచ్చరించినా తీరు మారకపోవడంతో ఆగ్రహం**
- **కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ప్రకటన**

జనసేన పార్టీకి చెందిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై వస్తున్న ఆరోపణల వ్యవహారంపై డిప్యూటీ సీఎం, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. బాలరాజుపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు పవన్ కల్యాణ్ ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తున్నట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నిర్ణయం పార్టీలో అంతర్గతంగా కలకలం రేపుతోంది. గత కొంతకాలంగా ఎమ్మెల్యే బాలరాజు వ్యవహారశైలి, పనితీరుపై పవన్ కల్యాణ్



తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల మీడియాలో ఆయనపై ఆరోపణలు రావడంతో ఈ వ్యవహారాన్ని అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. గతంలోనే బాలరాజును పార్టీ కార్యాలయానికి పిలిపించి, గిరిజన ప్రజలకు పారదర్శకమైన, నీతివంతమైన పాలన అందించాలని, వారి సేవకే అంకితం కావాలని పవన్ కల్యాణ్ వ్యక్తిగతంగా సూచించారు. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పు రాకపోవడంపై పవన్ తీవ్ర అసహనం, విసుగుతో ఉన్నట్లు పార్టీ ప్రకటనలో పేర్కొన్నారు. ఓవైపు 'అడవితల్లి బాట' వంటి కార్యక్రమాల ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పార్టీ కృషి చేస్తుంటే, అదే గిరిజన ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధి వ్యవహారశైలిపై వస్తున్న ఆరోపణలు పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ ఈ విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను నిగ్గు తేల్చి, పార్టీ అధ్యక్షుడికి నివేదిక సమర్పించనుంది. ఆ నివేదిక ఆధారంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై తదుపరి చర్యలు ఉంటాయని జనసేన పార్టీ స్పష్టం చేసింది. దీంతో బాలరాజు రాజకీయ భవిష్యత్తుపై ఉత్కంఠ నెలకొంది.

## విజయవాడకు విచ్చేస్తున్న
# రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- **దసరా ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రికి రానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**
- **అక్టోబర్ 16న అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు**
- **పది రోజుల పాటు రూ.100, రూ.300, రూ.500 దర్శన టికెట్లు రద్దు**

విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరగనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొననున్నారు. అక్టోబర్ 14వ తేదీన ఆమె దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజుల



పాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. రాష్ట్రపతితో పాటు, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అమ్మవారిని దర్శించుకోనున్నారు. అక్టోబర్ 16న మూలా నక్షత్రం రోజున ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరఫున కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ ఉత్సవాలకు సుమారు 20 లక్షల నుంచి 25 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ దర్శన టికెట్ల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్సవాలు జరిగే పది రోజుల పాటు రూ.100, రూ.300, రూ.500 ధర గల దర్శన టికెట్లను పూర్తిగా రద్దు చేసింది. కేవలం ఉచిత దర్శనంతో పాటు, త్వరితగతిన దర్శనం కోరుకునే వారి కోసం రూ.1000 ప్రత్యేక శీఘ్రదర్శనం టికెట్‌ను మాత్రమే అందుబాటులో ఉంచింది. ఈ టికెట్లను 'మన మిత్ర' వాట్సాప్ సేవ ద్వారా పొందవచ్చని అధికారులు తెలిపారు. సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఉదయం 6 నుంచి 8 గంటల వరకు మాత్రమే ప్రోటోకాల్, వీఐపీ దర్శనాలకు సమయం కేటాయించినట్లు ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ తెలిపారు. రద్దీని బట్టి సాయంత్రం వేళ కూడా వీఐపీ దర్శనాలకు మరో స్లాట్ కేటాయించే అవకాశం ఉందని వివరించారు. భక్తుల కోసం భారీ క్యూ కాంప్లెక్స్‌లు, ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేశారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై
# వెనక్కి తగ్గేది లేదు: ఎమ్మెల్యే గల్లా మాధవి

- **సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూనే బీసీలకు న్యాయం చేసేందుకు కట్టుబడి ఉన్నామని వ్యాఖ్య**
- **34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి ఎందుకు తగ్గించారో వైసీపీ సమాధానం చెప్పాలని డిమాండ్**
- **వైసీపీ హయాంలో బీసీ సంక్షేమ నిధులు రూ.70 వేల కోట్లు దారి మళ్లాయని ఆరోపణ**
- **బీసీల రాజకీయ ఎదుగుదలకు వైసీపీ అడ్డుపడిందని విమర్శలు**



స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గల్లా మాధవి స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూనే, పార్టీ పరంగా బీసీలకు న్యాయం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని ఆమె తేల్చిచెప్పారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బీసీల రిజర్వేషన్ల అంశంపై వైసీపీ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని తీవ్రంగా విమర్శించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం సాధ్యం కాదంటూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పునే సుప్రీంకోర్టు సమర్థించిందని గల్లా మాధవి గుర్తుచేశారు. అయినప్పటికీ, తమ ప్రభుత్వం బీసీల సంక్షేమానికి మొదటి నుంచి కట్టుబడి ఉందన్నారు. స్వర్గీయ ఎన్టీ రామారావు బీసీలకు 20 శాతం రిజర్వేషన్లతో రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తే, చంద్రబాబు దానిని 34 శాతానికి పెంచి వారి జీవితాల్లో సుస్థిరమైన మార్పు తీసుకొచ్చారని వివరించారు. ఈ లక్ష్యం సాధనలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆమె పునరుద్ఘాటించారు. ఈ అంశంపై వైసీపీ తీరును గల్లా మాధవి తీవ్రంగా తప్పుబట్టారు. "34 శాతం రిజర్వేషన్లను వ్యతిరేకించిన వైసీపీ, వారి ఐదేళ్ల పాలనలో వాటిని 24 శాతానికి ఎందుకు పరిమితం చేసిందో బీసీలకు సమాధానం చెప్పాలి" అని ఆమె డిమాండ్ చేశారు. గతంలో కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్ల కోసం జీవోలు జారీ చేస్తే, వైసీపీ నేతలు కుట్రపూరితంగా కోర్టుల్లో పిటిషన్లు వేయించారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల బీసీలు సుమారు 16,800 రాజకీయ పదవులను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో బీసీ సంక్షేమానికి కేటాయించిన నిధుల్లో దాదాపు రూ.70 వేల కోట్లను దారి మళ్లించారని గల్లా మాధవి విమర్శించారు. కేవలం నామమాత్రపు కార్పొరేషన్లను ఏర్పాటు చేసి నిధులు కేటాయించలేదని, బీసీ మంత్రులను కేవలం ప్రభుత్వ కుంభకోణాలను సమర్థించుకోవడానికే వాడుకున్నారని ధ్వజమెత్తారు. కడప జిల్లాలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే బీసీ నాయకత్వాన్ని అణచివేసిన చరిత్ర వారికి ఉందని, అలాంటి నేపథ్యం ఉన్నవారు ఇప్పుడు బీసీల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. న్యాయస్థానం తీర్పు ఎలా ఉన్నప్పటికీ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించి తీరుతామని గల్లా మాధవి స్పష్టం చేశారు. బీసీల రాజకీయ, ఆర్థిక, సామాజిక సాధికారతే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగానే తమ కార్యాచరణ ఉంటుందని ఆమె వివరించారు.

# వైకాపాకు ఎదురుదెబ్బ.. స్థానిక ఎన్నికలకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్

దిల్లీ: వైకాపాకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఏపీలో స్థానిక ఎన్నికల నిర్వహణకు అత్యున్నత న్యాయస్థానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 'సర్' ప్రక్రియ పూర్తయిన తరువాతే స్థానిక ఎన్నికలు జరపాలంటూ వైకాపా దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఆ పార్టీ లేవనెత్తిన ఏ విషయాన్నీ అత్యున్నత న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోలేదు. హైకోర్టు ఇచ్చిన సమయం ప్రకారం ఆరు వారాల్లోపు నోటిఫికేషన్‌కు సిద్ధమని రాష్ట్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలిపింది. నోటిఫికేషన్ విడుదలయ్యేలోపు 'సర్' పూర్తయితే ఆ జాబితా తీసుకోవాలని.. లేకపోతే పాత జాబితా ప్రకారమే ఎన్నికలు నిర్వహించుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో ఏపీ



హైకోర్టు ఇచ్చిన తీర్పును సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సమర్థించింది. ఎన్నికలకు ఆటంకం కలిగించడమంటే ప్రజా ప్రయోజనాలను అడ్డుకోవడమేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బీసీ రిజర్వేషన్లపై పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశంపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. 34 శాతం కోటాతో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటుతున్నాయంటూ ఏపీ ప్రభుత్వం జారీ చేసిన రెండు జీవోలను హైకోర్టు ఇటీవల కొట్టివేసిన సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం నిరాకరించింది. డెడికేటెడ్ కమిషన్ నివేదికను అమలు చేస్తున్నట్లు ఎక్కడుందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లే మా లక్ష్యం: కాగిత కృష్ణప్రసాద్

- **బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడమే లక్ష్యం**
- **కోర్టు కేసులతో వైసీపీ అడ్డుకుంటోందని ఆరోపణ**
- **బీసీల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందని వెల్లడి**
- **34 శాతం రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించిన కూటమి ప్రభుత్వం**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని వైసీపీ అడ్డుకుంటోందని పెనమలూరు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆరోపించారు. కోర్టుల్లో కేసులు వేయిస్తూ బీసీలకు న్యాయం జరగకుండా వైసీపీ కుట్ర చేస్తోందని విమర్శించారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కట్టుబడి ఉందని కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ ఎన్టీ రామారావు బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, ఆ తర్వాత చంద్రబాబు దానిని 34 శాతానికి పెంచి వారి అభివృద్ధికి బలమైన పునాది వేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అదే 34 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు సిద్ధమవుతుంటే, బీసీల సంక్షేమం ఇష్టం లేని వైసీపీ నాయకులు న్యాయస్థానాలను ఆశ్రయించి అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు వంటి బీసీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి వేధించారని కృష్ణప్రసాద్ విమర్శించారు. రిజర్వేషన్ల విషయంలోనూ రెండు పార్టీల వైఖరిలో స్పష్టమైన వ్యత్యాసం ఉందన్నారు. గతంలో హైకోర్టు ప్రతికూల తీర్పు ఇచ్చినప్పుడు వైసీపీ ప్రభుత్వం కేవలం 24 శాతం రిజర్వేషన్లకే పరిమితమైందని, కానీ కూటమి ప్రభుత్వం మాత్రం 34 శాతం రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించిందని వివరించారు. బీసీల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతోందని ఆయన తెలిపారు. గౌడ సామాజిక వర్గానికి ఇచ్చిన హామీ మేరకు మద్యం దుకాణాలు, బార్ల కేటాయింపుల్లో 10



శాతం రిజర్వేషన్లు కల్పించామని పేర్కొన్నారు. చేనేత కార్మికులకు రూ. 25 వేల ఆర్థిక సాయంతో పాటు గత ప్రభుత్వ హయాంలోని బకాయిలను కూడా చెల్లిస్తున్నామని చెప్పారు. మత్స్యకారులకు వేట నిషేధ భృతిని రూ. 10 వేల నుంచి రూ. 20 వేలకు పెంచినట్లు వెల్లడించారు. బీసీలను ఉన్నత పదవుల్లో నిలబెట్టడమే టీడీపీ విధానమని, విద్యార్థి దశ నుంచే చంద్రబాబు బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ వస్తున్నారని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు.

# స్థానిక ఎన్నికలు ఆపేందుకు వైసీపీ కుట్ర: మంత్రి కొల్లు రవీంద్ర

- **ఎన్నికలు జరగకపోతే రూ. 12,500 కోట్ల కేంద్ర నిధులు ఆగిపోతాయని వెల్లడి**
- **బీసీలకు 34% రిజర్వేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టీకరణ**
- **గతంలో వైసీపీయే రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని విమర్శ**
- **ఓటమి భయంతోనే వైసీపీ కోర్టులకు వెళ్లి ఎన్నికలను అడ్డుకుంటోందని వ్యాఖ్య**

వైసీపీ స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతోందని, తద్వారా రాష్ట్రానికి రావాల్సిన రూ. 12,500 కోట్ల ఆర్థిక సంఘం నిధులను నిలిపివేయాలని చూస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వర్గీయ ఎన్టీఆర్ బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల పునాది వేయగా, ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని 34 శాతానికి



పెంచి వారి ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేశారని కొల్లు రవీంద్ర గుర్తుచేశారు. అయితే, గత ప్రభుత్వం కుట్రపూరితంగా కోర్టుల ద్వారా ఈ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. దీనివల్ల దాదాపు 16,800 మంది బీసీలు రాజ్యాంగబద్ధమైన పదవులను కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీ మేరకు 34 శాతం రిజర్వేషన్ల అమలుపై అసెంబ్లీలో తీర్మానం చేశామని, దీనిపై ఏర్పాటు చేసిన రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని బీసీ కమిషన్ నివేదిక త్వరలో ప్రభుత్వానికి అందనుందని మంత్రి తెలిపారు. స్థానిక సంస్థల పదవీకాలం ముగిసినందున 16వ ఆర్థిక సంఘం నిధులు సాధించాలంటే ఎన్నికల నిర్వహణ తప్పనిసరని, ఈ క్రమంలో ప్రభుత్వం ముందుకు వెళుతుంటే.. ఓటమి భయంతో వైసీపీ మరోసారి కోర్టులను ఆశ్రయించి ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవాలని చూస్తోందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన రూ.12,500 కోట్లు రాకుండా అడ్డుకోవడమే వారి దురుద్దేశమని విమర్శించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణ వ్యవస్థ సర్వనాశనమైందని కొల్లు రవీంద్ర మండిపడ్డారు. రాజశేఖర్ రెడ్డి హయాం నుంచే బీసీల ఎదుగుదలను అడ్డుకుంటున్నారని, జగన్ పాలనలో తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య వంటి బీసీ నేతల హత్యలు జరిగాయని ఆరోపించారు. ఇప్పుడు కల్లబొల్లి మాటలతో బీసీలను మభ్యపెట్టాలని చూస్తున్నారని, వారి నాటకాలను బీసీ సోదరులు ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మరని హితవు పలికారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయిస్తోందని, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు వంటి హామీలను నెరవేరుస్తోందని వివరించారు. చట్టపరంగా అన్ని అడ్డంకులను అధిగమించి బీసీలకు న్యాయం చేస్తామని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్నికలు నిర్వహించి తీరుతామని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

# రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం: నాదెండ్ల మనోహర్

- **పారిశ్రామికవేత్తల్లో భరోసా నింపుతున్నామన్న నాదెండ్ల**
- **పారిశ్రామిక ప్రగతితో యువతకు భారీగా ఉద్యోగాలు కల్పిస్తామని హామీ**
- **వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 11 సీట్లు కూడా దక్కవని వ్యాఖ్య**

ఆంధ్రప్రదేశ్‌కు రూ. 20 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తూ, యువతకు భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన అజెండా అని ఆయన స్పష్టం చేశారు. పారదర్శక విధానాలు, పరిశ్రమలకు వేగవంతమైన అనుమతులు, పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వాతావరణం సృష్టించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మనోహర్ వివరించారు. గత వైసీపీ పాలనలో నెలకొన్న అనిశ్చితిని తొలగించి, పారిశ్రామిక వర్గాల్లో మళ్లీ భరోసా నింపడంలో తమ ప్రభుత్వం విజయం సాధించిందని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం వైసీపీ బెదిరింపు రాజకీయాలకు పాల్పడిందని మనోహర్ ఆరోపించారు. దీనివల్ల ప్రజాస్వామ్య విలువలు దెబ్బతిని, ప్రజలు స్వేచ్ఛను కోల్పోయారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలో భయరహిత వాతావరణాన్ని నెలకొల్పిందని, శాంతిభద్రతలు,



పౌర హక్కులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వైసీపీ రాజకీయ భవిష్యత్తుపై జోస్యం చెప్పారు. రానున్న ఎన్నికల్లో ప్రస్తుతం ఆ పార్టీకి ఉన్న 11 అసెంబ్లీ స్థానాలు కూడా దక్కవని, వైసీపీ పతనం అనివార్యమని అన్నారు. ప్రజలు ఇప్పటికే గత పాలనను తిరస్కరించారని, సంక్షేమం, అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం చూపుతున్న చొరవపై బలమైన విశ్వాసంతో ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై వెనక్కి తగ్గేది లేదు.. ఇది మా విధానం: టీడీపీ

- స్థానిక సంస్థల్లో బీసీలకు 34% రిజర్వేషన్ల అమలుపై కీలక ప్రకటన
- చట్టపరంగా వీలుకాకపోయినా పార్టీపరంగా సీట్లు కేటాయిస్తామని వెల్లడి
- వైసీపీ వల్లే బీసీలు రిజర్వేషన్లు కోల్పోయారని టీడీపీ ఆరోపణ
- గత, ప్రస్తుత ప్రభుత్వాల్లో బీసీల కోసం అమలు చేస్తున్న పథకాల వెల్లడి
- బీసీల రాజకీయ ఎదుగుదలకు ఎప్పుడూ అండగా ఉంటామని స్పష్టీకరణ
- సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో టీడీపీ ప్రకటన

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో తెలుగుదేశం పార్టీ తన విధానాన్ని స్పష్టం చేసింది. చట్టపరమైన ఆమోదం లభించకపోయినా, పార్టీ తరఫున బీసీలకు 34 శాతం సీట్లు కేటాయించి వారి రాజకీయ గౌరవాన్ని కాపాడతామని కీలక ప్రకటన చేసింది. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకు జీవో 105, 1065 ద్వారా 34 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నం చేశామని, అయితే వైసీపీ నేతలు కోర్టులకు వెళ్లడం వల్లే హైకోర్టు ఆ జీవోలను కొట్టివేసిందని టీడీపీ ఆరోపించింది. ఈ విషయంలో తాము వెనక్కి తగ్గకుండా సుప్రీంకోర్టును ఆశ్రయించామని, సీనియర్ న్యాయవాదులను నియమించి పోరాడినా దురదృష్టవశాత్తు అనుకూల తీర్పు రాలేదని తెలుగుదేశం పార్టీ గుర్తుచేసింది. అయినా సరే, బీసీల విషయంలో తమ నిబద్ధతను చాటుకుంటామని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీపరంగా 34 శాతానికి తగ్గకుండా బీసీ వర్గాలకు సీట్లు కేటాయిస్తామని ఉద్ఘాటించింది. బీసీల రాజకీయ ఎదుగుదలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని, వారికి న్యాయం చేయడమే తమ లక్ష్యమని, కానీ వారి హక్కులను అడ్డుకోవడమే వైసీపీ వైఖరి అని విమర్శించింది. కుట్రలు చేసి, కోర్టులకు వెళ్లి రిజర్వేషన్లు పోయేలా చేసి, మళ్లీ తమపైనే ఆరోపణలు చేయడం వైసీపీకి అలవాటుగా మారిందని దుయ్యబట్టింది. నాడు హైకోర్టు రిజర్వేషన్లు కొట్టివేసినప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ, బీసీలకు న్యాయం చేసేందుకు కనీస ప్రయత్నం కూడా చేయలేదని ఆక్షేపించింది.

**బీసీలకు అండగా నిలిచింది టీడీపీనే**

బీసీలకు రాజ్యాధికారం అనే మాటను తొలిసారిగా పలికి, వారికి అవకాశాలు కల్పించింది తెలుగుదేశం పార్టీయేనని ఈ సందర్భంగా టీడీపీ గుర్తుచేసింది. పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ కారణంగా నాలుగు దశాబ్దాల క్రితమే బీసీల గళం వినిపించిందని, ఆ తర్వాత తాము ఆ స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్లామని తెలిపింది. 1995లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచిన ఘనత తమదేనని పేర్కొంది. బీసీలు తమకు అండగా ఉన్నారనే అక్కసుతోనే గత వైసీపీ ప్రభుత్వం వారిని అణగదొక్కే ప్రయత్నం చేసిందని, 30 ఏళ్లుగా అమలవుతున్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని ఆరోపించింది. దీనివల్ల సుమారు 16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేసింది.

**గత, ప్రస్తుత ప్రభుత్వాల్లో బీసీలకు మేలు**

బీసీ ఫెడరేషన్లకు నాంది పలికింది కూడా తమ ప్రభుత్వమేనని టీడీపీ తెలిపింది. కులవృత్తులు, చేతివృత్తులను పరిరక్షించేందుకు, వారి జీవనోపాధిని మెరుగుపరిచేందుకు 'ఆదరణ' వంటి పథకాలను తీసుకువచ్చామని, ఈ పథకం కింద 341 రకాల పనిముట్లను 90 శాతం సబ్సిడీతో అందించామని గుర్తుచేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వివరించింది. ఇందులో భాగంగా వడ్డెర్లకు 10 శాతం మైనింగ్ లీజులు, గీత కార్మికులకు 10 శాతం ఎక్సైజ్ షాపులు కేటాయించామని తెలిపింది. 'నేతన్న సేవ' పథకం కింద ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.25,000 ఆర్థిక సహాయం అందిస్తున్నామని, చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్ మగ్గాలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని పేర్కొంది. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయం అందించే పథకాన్ని తామే ప్రారంభించామని, ఇప్పుడు 'మత్స్యకార సేవ' పథకం కింద ఆ సహాయాన్ని రూ.20,000కు పెంచామని వివరించింది. సబ్సిడీపై బోట్లు, డీజిల్ అందిస్తూ, తీరప్రాంతంలో వారి హక్కులకు రక్షణ కల్పిస్తున్నామని తెలిపింది. గత ప్రభుత్వం అన్యాయంగా తెచ్చిన జీవో నెంబర్ 217ను రద్దు చేసి మత్స్యకార సొసైటీల హక్కులను కాపాడామని, మత్స్యకార మహిళలకు సీ వీడ్ పెంపకంపై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నామని చెప్పింది. నాయీ బ్రాహ్మణులు నిర్వహించే సెలూన్లకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, దేవాలయాల్లో పనిచేసే వారికి భృతిని రూ.15,000 నుంచి రూ.25,000కు పెంచామని తెలిపింది. స్వర్ణకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశామని పేర్కొంది. చట్టపరంగా ఏది ఏమైనప్పటికీ, రాజకీయంగా బీసీలకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్ల హామీని నిలబెట్టుకుంటామని టీడీపీ పునరుద్ఘాటించింది.

# తెలుగు సాహితీ లోకంలో విషాదం.. ముదిగొండ ఇకలేరు

- చారిత్రక నవలా చక్రవర్తి ముదిగొండ శివప్రసాద్ కన్నుమూత
- హైదరాబాద్‌లో గుండెపోటుతో 86 ఏళ్ల వయసులో అస్తమయం
- ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసిన ముదిగొండ
- 80కి పైగా చారిత్రక, సాహిత్య గ్రంథాలు రచించిన ఘనత
- నేడు అంబర్‌పేట శ్మశానవాటికలో అంత్యక్రియలు



ప్రముఖ చారిత్రక నవలా రచయిత, 'చారిత్రక నవలా చక్రవర్తి'గా ఖ్యాతి గడించిన ముదిగొండ శివప్రసాద్ (86) కన్నుమూశారు. గత ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు గురువారం రాత్రి గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 8:45 గంటల సమయంలో మరోసారి గుండెపోటు రావడంతో ఆయన తుదిశ్వాస విడిచారు. 1940 డిసెంబర్ 23న ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామంలో జన్మించిన శివప్రసాద్, హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు విభాగంలో ఆచార్యులుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. తన సుదీర్ఘ సాహిత్య ప్రస్థానంలో ఆయన 80కి పైగా గ్రంథాలను రచించగా, వాటిలో 20కి పైగా చారిత్రక నవలలు ఉన్నాయి. కాకతీయ కళాదర్శనం, తంజావూరు విజయం, రెసిడెన్సీ, శ్రీలేఖ, ఆవాహన వంటి రచనలు తెలుగు సాహిత్యంలో విశేష ఆదరణ పొందాయి. భారత చరిత్రను, సంస్కృతిని తన రచనల ద్వారా సామాన్య పాఠకులకు చేరువ చేయడంలో ఆయన విశేష కృషి చేశారు. ఆయనకు కుమారుడు ఇందుశేఖర్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన భార్య కొన్నేళ్ల క్రితమే మరణించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు శివం రోడ్డులోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో గల ఆయన నివాసం నుంచి అంతిమయాత్ర ప్రారంభమై, అంబర్‌పేట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ముదిగొండ శివప్రసాద్ మరణం తెలుగు చారిత్రక సాహిత్య రంగానికి తీరని లోటని పలువురు సాహితీవేత్తలు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

# సాయికృష్ణది కస్టడీ హత్యే.. ఛార్జిషీట్‌లో సంచలన విషయాలు!

- విజయవాడ సాయికృష్ణది కస్టడీ మృతేనని తేల్చిన సిట్
- సీఐ సహా ఏడుగురు పోలీసులే నిందితులుగా ఛార్జిషీట్
- సాక్ష్యాలను మాయం చేసేందుకు అన్ని విధాలా ప్రయత్నించిన పోలీసులు
- 120 మంది సాక్షులను విచారించి కోర్టుకు నివేదిక సమర్పణ



రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ కస్టడీ మృతి కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) న్యాయస్థానానికి ప్రాథమిక ఛార్జిషీట్‌ను సమర్పించింది. విజయవాడలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సాయికృష్ణ మృతికి పోలీసుల చిత్రహింసలే ప్రధాన కారణమని సిట్ తన నివేదికలో నిర్ధారించింది. ఈ కేసులో అప్పటి సీఐ నాగరాజుతో పాటు మొత్తం ఏడుగురు పోలీసులను నిందితులుగా పేర్కొంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కేసులో అత్యంత నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపినట్లు సిట్ కోర్టుకు వివరించింది. దర్యాప్తులో భాగంగా సుమారు 120 మంది సాక్షులను విచారించిన అధికారులు, కీలక ఆధారాలతో కూడిన 263 పత్రాలను 86 పేజీల ఛార్జిషీట్‌కు జతచేశారు. నాన్‌బెయిలబుల్ వారెంట్‌పై ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి సాయికృష్ణను విజయవాడకు తరలించిన పోలీసులు, కృష్ణలంక స్టేషన్‌లో అతడిపై అమానవీయంగా దాడి చేసినట్లు తేలింది. తీవ్ర చిత్రహింసల కారణంగా ఆరోగ్యం క్షీణించి సాయికృష్ణ ప్రాణాలు కోల్పోగా, అనంతరం నిందితులు మృతదేహాన్ని దుప్పటిలో చుట్టి, అర్ధరాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా శ్మశానవాటికకు తరలించి దహనం చేసినట్లు సిట్ తన నివేదికలో వెల్లడించింది. ఈ మరణాన్ని కప్పిపుచ్చేందుకు నిందితులు పక్కా ప్రణాళికతో సాక్ష్యాధారాలను ధ్వంసం చేసినట్లు సిట్ స్పష్టం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా లాకప్ డైరీ, జనరల్ డైరీ, సెంట్రీ బుక్‌లో నిందితుడికి సంబంధించిన ఎలాంటి వివరాలను నమోదు చేయలేదని పేర్కొంది. ఘటన అనంతరం స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజీని మాయం చేయడం, నేర ఆనవాళ్లు దొరక్కుండా పోలీస్ స్టేషన్‌కు రంగులు వేయించడం, లాకప్‌ను నీళ్లతో కడిగేయడం వంటి చర్యల ద్వారా సాక్ష్యాలను తుడిచిపెట్టే ప్రయత్నం చేసినట్లు ఛార్జిషీట్‌లో పొందుపరిచారు. సాయికృష్ణ మృతికి ఈ ఏడుగురు నిందితులే ప్రత్యక్ష బాధ్యులని సిట్ తేల్చిచెప్పింది. అయితే, ఈ కేసులో లోతైన దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని ప్రత్యేక దర్యాప్తు బృందం న్యాయస్థానానికి విన్నవించింది.

# తెలంగాణ ఆడపడుచులకు సీఎం రేవంత్ బతుకమ్మ శుభాకాంక్షలు

- ప్రకృతి ఆరాధనకు, ఐక్యతకు బతుకమ్మ ప్రతీక అన్న సీఎం
- ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతుందన్న ముఖ్యమంత్రి
- బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన మాజీ సీఎం కేసీఆర్

తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా రాష్ట్ర మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న ఈ తొమ్మిది రోజుల పూల ఉత్సవాలను మహిళలందరూ ఆనందోత్సాహాల మధ్య, సంప్రదాయ పాటలు, నృత్యాలతో ఘనంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక సందేశాన్ని విడుదల చేశారు. బతుకమ్మ పండుగ తెలంగాణ విశిష్ట సంస్కృతికి అద్దం పడుతుందని, ప్రకృతిని ఆరాధించే అత్యంత గొప్ప సంప్రదాయమని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి, గౌరమ్మను పూజించడం తెలంగాణ జీవన విధానంలో ఒక భాగమని ఆయన పేర్కొన్నారు. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై సద్దుల బతుకమ్మ వరకు సాగే ఈ వేడుకలు ప్రజల మధ్య ఐక్యతను, సామూహిక జీవన సౌందర్యాన్ని చాటిచెబుతాయని ఆయన కొనియాడారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం



సిద్ధించిన తర్వాత తమ ప్రభుత్వం బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ పండుగ నేడు తెలంగాణ ప్రజల జీవనశైలిలో ఒక అంతర్భాగంగా మారిపోయిందని ఆయన పేర్కొన్నారు.

# మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన యువ చెస్ కెరటం చల్లా నిహారిక

- మంత్రి లోకేశ్‌తో యువ చెస్ క్రీడాకారిణి నిహారిక భేటీ
- ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్ సాధించినందుకు అభినందనలు
- ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ కావడమే తన లక్ష్యమని వెల్లడించిన నిహారిక
- ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందిస్తామని లోకేశ్ హామీ



ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ చెస్ క్రీడాకారిణి, ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ చల్లా నిహారిక రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. శుక్రవారం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి లోకేశ్‌తో భేటీ అయింది. ఇటీవలే ప్రతిష్ఠాత్మక ఫిడే ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ హోదాను సాధించిన నిహారికను ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ భేటీలో నిహారిక సాధించిన విజయాలను మంత్రి లోకేశ్ ప్రశంసించారు. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తూ రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్నారని కొనియాడారు. నిహారిక ప్రతిభ, పట్టుదల భవిష్యత్తులో ఎందరో యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా తన భవిష్యత్ లక్ష్యాలను నిహారిక మంత్రికి వివరించింది. ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ టైటిల్ సాధించడమే తన తదుపరి లక్ష్యమని ఆమె స్పష్టం చేసింది. ఆమె ఆకాంక్షలను విన్న మంత్రి లోకేశ్, లక్ష్యసాధనలో ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. శిక్షణ, అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొనడానికి అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామని భరోసా కల్పించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ విధానమని ఆయన పునరుద్ఘాటించారు.

# దసరా పండుగ సందడి.. కిక్కిరిసిన ఎంజీబీఎస్, జేబీఎస్

- దసరా సెలవులతో హైదరాబాద్ బస్టాండ్లలో పెరిగిన ప్రయాణికుల రద్దీ
- రాష్ట్రవ్యాప్తంగా 7,000 ప్రత్యేక బస్సులను నడుపుతున్న టీజీఎస్ఆర్టీసీ
- ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీలపై 50 శాతం అదనం
- మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం యథాతథం
- ప్రయాణికుల కోసం ప్రధాన టెర్మినళ్లలో అదనపు సౌకర్యాల ఏర్పాటు

దసరా పండుగ సెలవులు ప్రారంభం కావడంతో హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. తెలంగాణలో పాఠశాలలకు శనివారం నుంచి దసరా సెలవులు ప్రకటించడంతో, శుక్రవారం సాయంత్రం నుంచే సొంతూళ్లకు వెళ్లేవారి సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. నగరంలోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్) ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. కుటుంబ సభ్యులు, విద్యార్థులతో బస్టాండ్ల ప్రాంగణాలన్నీ సందడిగా మారాయి. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికుల సౌకర్యార్థం అక్టోబర్ 18వ తేదీ వరకు మొత్తం 7,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక సర్వీసుల్లో అత్యధికంగా కరీంనగర్ జోన్ నుంచి 3,533 బస్సులు నడుస్తుండగా, హైదరాబాద్ జోన్ నుంచి 2,155, గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 బస్సులు అందుబాటులో ఉన్నాయి. నగరంలోని ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు ఉప్పల్, ఆరాంఘర్, ఎల్బీ నగర్ క్రాస్‌రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి వంటి కీలక ప్రాంతాల నుంచి కూడా ఈ ప్రత్యేక సర్వీసులు నడుస్తున్నాయి. అయితే, ఈ ప్రత్యేక బస్సు సర్వీసుల్లో ఛార్జీలను 1.5 రెట్లు (50 శాతం అదనంగా) పెంచినట్లు టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే అక్టోబర్ 9, 10, 16, 17 తేదీలతో పాటు, తిరుగు ప్రయాణ రద్దీ ఉండే అక్టోబర్ 25, 26 తేదీల్లో ఈ పెంచిన ఛార్జీలు వర్తిస్తాయి. సాధారణ బస్సు సర్వీసుల్లో ఛార్జీలలో ఎలాంటి మార్పు లేదని, 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం యథావిధిగా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన బస్టాండ్లలో తాత్కాలిక షెల్టర్లు, తాగునీటి సౌకర్యం, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్, మొబైల్ టాయిలెట్లను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. సెలవుల అనంతరం తిరుగు ప్రయాణ రద్దీని కూడా దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న మార్గాల్లో అవసరాన్ని బట్టి అదనపు బస్సులను నడుపుతామని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# జీఓ 59పై మంత్రి పొంగులేటి ప్రకటన.. నెలలోగా దరఖాస్తులు క్లియర్

తెలంగాణలో జీఓ 59 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 500 చదరపు గజాల లోపు ఉన్న ప్లాట్లకు సంబంధించిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన 22ఏ సమస్యల పరిష్కార హామీ అమలులో ఇది మరో కీలక ముందడుగు అని అన్నారు. ఈ మేరకు పెండింగ్ దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం మెమో నెం. 48030 జారీ చేసిందని మంత్రి వివరించారు. "జీఓ 59 అమలులో ఎలాంటి అక్రమాలకు తావులేదు. నిబంధనల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయి" అని ఆయన హామీ ఇచ్చారు.



# అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలా? జాగ్రత్త.. సజ్జనార్ హెచ్చరిక!

అర్ధరాత్రి వేళ రోడ్లపై పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ నగరవాసులకు విజ్ఞప్తి చేశారు. ట్యాంక్‌బండ్‌తో పాటు నగరంలోని ప్రధాన రహదారులు, చెరువులు, పార్కుల వద్ద అర్ధరాత్రి కేక్ కటింగ్‌లు చేయొద్దని స్పష్టం చేశారు. సరదా కోసం చేసే చిన్నపాటి నిర్లక్ష్యం కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజుల క్రితం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ట్యాంక్‌బండ్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరేళ్ల చిన్నారి, ఆమె బంధువు ప్రాణాలు కోల్పోయారు. చిన్నారి పుట్టినరోజు వేడుకల సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని సజ్జనార్ తెలిపారు.

# తమిళ రాజకీయాల్లో కొత్త మలుపు.. పెద్దల సభకు లతా రజనీకాంత్?

- **రాజ్యసభకు లతా రజనీకాంత్ నామినేట్ అవుతారనే ప్రచారం**
- **ఢిల్లీలో బీజేపీ అగ్రనేతలతో ఆమె వరుస సమావేశాలు**
- **రాష్ట్రపతి కోటాలో పెద్దల సభకు పంపేందుకు బీజేపీ యోచన**
- **తమిళనాట బలపడేందుకు బీజేపీ కొత్త రాజకీయ వ్యూహం**
- **రజనీకాంత్ అభిమానులను ఆకర్షించడంపై కాషాయ పార్టీ దృష్టి**

తమిళనాడు రాజకీయాలు మరోసారి అనూహ్య మలుపు తీసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. దశాబ్దాలుగా ద్రవిడ పార్టీల ఆధిపత్యం కొనసాగుతున్న ఆ రాష్ట్రంలో పాగా వేసేందుకు బీజేపీ సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. సూపర్‌స్టార్ రజనీకాంత్ అర్ధాంగి లతా రజనీకాంత్‌ను రాజ్యసభకు పంపేందుకు రంగం సిద్ధమవుతోందన్న వార్తలు జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్రపతి కోటాలో ఆమెను పెద్దల సభకు నామినేట్ చేసే అవకాశాలపై ఢిల్లీ స్థాయిలో విస్తృత చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. గతంలో రజనీకాంత్ రాజకీయ ప్రవేశం దాదాపు ఖాయమైనట్లే కనిపించినా, అనారోగ్య కారణాలతో ఆయన చివరి నిమిషంలో ఆ నిర్ణయం నుంచి వెనక్కి తగ్గారు. అయితే ఇప్పుడు ఆయన అర్ధాంగి లతా రజనీకాంత్ రాజకీయాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఆమె ఇటీవల



ఢిల్లీలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వంటి బీజేపీ అగ్రనేతలతో సమావేశమయ్యారని, త్వరలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోనూ భేటీ కానున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ పరిణామాలతో ఆమె రాజ్యసభ ప్రవేశం దాదాపు ఖాయమనే ఊహాగానాలు బలపడుతున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 80(3) ప్రకారం కళలు, సాహిత్యం, విజ్ఞాన శాస్త్రం, సామాజిక సేవ వంటి రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన 12 మందిని రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేయవచ్చు. లతా రజనీకాంత్ కేవలం సూపర్‌స్టార్ భార్యగానే కాకుండా, ఒక గాయనిగా, విద్యావేత్తగా, సామాజిక కార్యకర్తగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె నిర్వహిస్తున్న ఆశ్రమ్ పాఠశాల, చిన్నారుల హక్కులు, సంక్షేమం కోసం చేస్తున్న కృషిని 'సామాజిక సేవా' కోటా కింద పరిగణించి, ఆమె పేరును రాజ్యసభకు సిఫారసు చేయాలని బీజేపీ అధిష్ఠానం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. తమిళనాట బలమైన పునాదులు వేసుకోవాలని బీజేపీ ఎప్పటినుంచో ప్రయత్నిస్తోంది. రజనీకాంత్‌కు ప్రధాని నరేంద్ర మోదీతో పాటు బీజేపీ అగ్రనాయకత్వంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. గతంలో ఆయనకు గవర్నర్ పదవిని ఆఫర్ చేసినట్లు వార్తలు వచ్చినా అవి కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు లతా రజనీకాంత్‌ను రాజ్యసభకు పంపడం ద్వారా రజనీకాంత్‌కు ఉన్న అపారమైన అభిమాన గణం, తటస్థ ఓటర్ల మద్దతును కూడగట్టుకోవచ్చని బీజేపీ భావిస్తోంది. ఇది తమిళనాడులో పార్టీకి కొత్త ఊపునిస్తుందని, ద్రవిడ పార్టీలకు బలమైన ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు మార్గం సుగమం చేస్తుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, ఢిల్లీ స్థాయిలో జరుగుతున్న ఈ చర్చలు ఎంతవరకు ఫలిస్తాయో, లతా రజనీకాంత్ నిజంగానే పెద్దల సభలో అడుగుపెడతారో లేదో తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడాలి.

## కీటకాన్ని చంపడానికి సుత్తి వాడతారా?: దిల్లీలో ఆంక్షలపై సుప్రీం

సీఈసీకి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ భారీ ఆందోళనలకు పిలుపునివ్వడంతో కేంద్రం దిల్లీలో ప్రయాణ ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. నిరసన తెలిపే పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడటంతో పాటు.. శాంతిభద్రతలను పరిరక్షించడం కూడా అంతే ముఖ్యమని వ్యాఖ్యానించింది. కేంద్రం చర్యలు కీటకాన్ని చంపడానికి సుత్తిని వాడినట్లు ఉన్నాయని పేర్కొంది. వివిధ పనుల నిమిత్తం నగరంలోని ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రయాణిస్తుంటారని.. కాబట్టి అన్నింటినీ మూసివేయడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. మూసివేసి ఉన్న మెట్రో స్టేషన్ల సంఖ్య తగ్గించాలని కేంద్రానికి సూచించింది. దిల్లీలో మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దుకు వ్యతిరేకంగా సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణలో భాగంగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. 'మా ఆందోళన ఏ ఒక్క నిరసనకారుడి గురించో లేదా



వ్యక్తి గురించో కాదు. మెట్రో, రైల్వే స్టేషన్ల ప్రవేశ ద్వారాలను పూర్తిగా మూసివేయడం గురించే మా ప్రధాన ఆందోళన. జీవనోపాధి కోసం గురుగ్రామ్, గ్రేటర్ నోయిడా, తూర్పు, దక్షిణ దిల్లీల నుంచి దేశ రాజధానికి నిత్యం వేల మంది ప్రయాణిస్తుంటారు. వారందరికీ సొంత వాహనాలు ఉండవు. ప్రజారవాణాపైనే ఆధారపడతారు. ఇలా అన్నింటినీ పూర్తిగా మూసేస్తే వారి పరిస్థితి ఏమవుతుంది? అనియంత్రిత కదలికలను అరికట్టడానికి, శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకునే అధికారం మీకు ఉంటుంది. కానీ, నిరసనలు ఆపడానికి ప్రజా జీవితాన్ని స్తంభింపచేయడం సరైంది కాదు. ఏ ప్రాంతంలో ఆంక్షలు అవసరం? ఎక్కడ అవసరం లేదనే విషయాలను దృష్టిలో ఉంచుకోవాలి' అని సుప్రీం కోర్టు పేర్కొంది. న్యాయస్థానం వ్యాఖ్యలపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ.. ఆంక్షల విషయంలో కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి, తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

యువతకు భయపడితే దేశం మొత్తాన్ని మూసివేయండి: దీప్కే

శనివారం సీజేపీ నిరసనల నేపథ్యంలో దిల్లీలోని 57 మెట్రో స్టేషన్ల మూసివేత ప్రకటనపై ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే (Abhijeet Dipke) విమర్శలు గుప్పించారు. జంతర్‌మంతర్ అనేది నిర్దేశిత ప్రదేశమని..అక్కడ నిరసన తెలిపేందుకు ప్రభుత్వ మద్దతు అవసరం లేదని పేర్కొన్నారు. యువతకు భయపడితే మొత్తం దేశాన్నే మూసివేయాలన్నారు.

## 13 మందిని చంపిన హంతకుడికి డిసెంబరు 3న మరణశిక్ష.. ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు

- **2009 ఫోర్ట్ హుడ్ కాల్పుల్లో 13 మందిని కాల్చి చంపిన హసన్**
- **ఫైరింగ్ స్క్వాడ్ ద్వారా శిక్ష అమలు చేయనున్న అమెరికా**
- **మరణశిక్షను లైవ్ ప్రసారం చేయనున్నట్లు పెంటగాన్ ప్రకటన**
- **న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే శిక్ష ఆలస్యమయ్యే అవకాశం**
- **శిక్ష ప్రత్యక్ష ప్రసారంపై న్యాయ నిపుణుల్లో భిన్నాభిప్రాయాలు**

అమెరికా సైనిక స్థావరం ఫోర్ట్ హుడ్‌లో 2009లో కాల్పులకు తెగబడి 13 మందిని చంపిన హంతకుడు నిడాల్ మాలిక్ హసన్‌కు డిసెంబరు 3న మరణశిక్ష అమలు చేయనున్నారు. ఫైరింగ్ స్క్వాడ్ ద్వారా ఈ శిక్షను అమలు చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన అధికారులు.. తాజాగా మరో సంచలన విషయాన్ని వెల్లడించారు. హసన్ మరణశిక్ష ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు పెంటగాన్ గురువారం తెలిపింది. అమెరికాలో సైనికుడికి ఆరు దశాబ్దాలకు పైగా



విరామం తర్వాత మరణశిక్ష అమలు కానుండటం, అది కూడా లైవ్‌లో చూపించనుండటం చర్చనీయాంశమైంది. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ బుధవారం ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఈ శిక్షను ప్రజలు చూసేలా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. దీంతో మరణశిక్షను బహిరంగంగా నిర్వహిస్తారా? అనే ప్రశ్నలు తలెత్తాయి. గురువారం పెంటగాన్ అధికారులు అసలు విషయం వెల్లడించారు. ఈ ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేస్తామని స్పష్టం చేశారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను తర్వాత వెల్లడిస్తామని తెలిపారు. హసన్ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే మరణశిక్ష అమలు ఆలస్యమయ్యే అవకాశం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. నిర్బంధం చట్టబద్ధతను పరిశీలించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేయవచ్చని పేర్కొంటున్నారు. మరోవైపు, మరణశిక్షను ప్రత్యక్ష ప్రసారం చేయడం వల్ల మరణశిక్ష అమలు ప్రక్రియపై ప్రజలకు అవగాహన పెరుగుతుందని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే, శిక్ష ఎదుర్కొనే వ్యక్తి గౌరవం, ఇలాంటి ప్రసారాల వెనుక ప్రభుత్వ ఉద్దేశం వంటి అంశాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. 2009 నవంబరు 5న ఫోర్ట్ హుడ్ సైనిక స్థావరంలోని వైద్య భవనంలోకి వెళ్లిన హసన్ కాల్పులు జరిపాడు. ఆ సమయంలో అక్కడ సైనికులు వైద్య పరీక్షలు, టీకాల కోసం వేచి ఉన్నారు. ఈ ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోగా, 32 మంది గాయపడ్డారు. అప్పట్లో ఆర్మీ మేజర్‌గా పనిచేసిన హసన్.. 2013లో విచారణ సందర్భంగా తానే కాల్పులు జరిపినట్లు అంగీకరించాడు. పోలీసుల కాల్పుల్లో నడుము కింది భాగం చచ్చుబడటంతో ప్రస్తుతం వీల్‌చైర్‌కే పరిమితమయ్యాడు.

## భారత పైలట్ స్మిత్ మచ్చర్‌కు ఇజ్రాయెల్ సాహస పురస్కారం

భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ విమానంలో సహ పైలట్ దాడి చేసినా వెనక్కి తగ్గలేదు.. తీవ్రంగా గాయపడినా ధైర్యంగా పోరాడి 174 మంది ప్రాణాలను కాపాడారు. ఆయన సాహసానికి ఇజ్రాయెల్ ప్రభుత్వం అరుదైన గౌరవం ప్రకటించింది. దేశ అత్యున్నత పౌర సాహస పురస్కారాన్ని అందించనున్నట్లు అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ వెల్లడించారు. మచ్చర్ కోలుకున్న తర్వాత స్వయంగా పురస్కారాన్ని అందజేస్తానని తెలిపారు. గతవారం దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. యూఏఈ దర్యాప్తు వివరాల ప్రకారం.. విమాన సహ పైలట్ హమామ్ అల్ హమామీ కాక్‌పిట్‌లోని గొడ్డలితో మచ్చర్‌పై దాడి చేశాడు. అనంతరం విమాన నియంత్రణను తన చేతుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనను ఉగ్రదాడిగా యూఏఈ అధికారులు అభివర్ణించారు. తనపై దాడి జరిగినా మచ్చర్ ప్రతిఘటించారు. గాయాలతోనే కాక్‌పిట్ తలుపు తెరిచారు. దీంతో లోపలికి వచ్చిన ప్రయాణికులు దాడి చేసిన సహ పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి సాహసంతో విమానం ప్రమాదానికి గురికాకుండా నిలువరించగలిగారు. ఈ ఘటనలో ధైర్యంగా వ్యవహరించిన ఆరుగురు ఇజ్రాయెల్ పౌరులకు సైతం హెర్జోగ్ పౌర సాహస పురస్కారాలను అందించారు. తాలి మేనెస్, జ్వికా మేనెస్, యానివ్ హయూన్, డాక్టర్ షోటా ముసాయేవ్, అసఫ్ రజువాన్, ఓర్ పార్డిలోవ్‌లను జెరూసలేంలోని అధ్యక్ష భవనంలో జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. ఇదిలా ఉండగా.. విమానంలో జరిగిన భయానక



ఘటనను మచ్చర్ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో పంచుకున్నారు. ఇజ్రాయెల్ తదుపరి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి వేడుక జ్యోతిని వెలిగించాల్సిందిగా మచ్చర్‌ను నెతన్యాహు ఆహ్వానించారు.

## ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారు : రాహుల్ గాంధీ

దిల్లీ: ఎస్ఐఆర్‌కు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ పెద్ద తప్పు చేశారని ఇండియా కూటమి నేతలు ఆరోపించారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, సీఈసీ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రపతితో భేటీ అనంతరం ఇండియా కూటమి నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, మమతా బెనర్జీ, ప్రియాంకా గాంధీ తదితరులు మీడియాతో మాట్లాడారు. ''ఓటు చోరీకి సంబంధించి రాష్ట్రపతికి వివరించాం. ఓట్ల చోరీ ఎక్కడెక్కడ జరిగిందో ఆధారాలు అడిగారు. బ్యాలెట్ పత్రాల ద్వారానే ఎన్నికలు జరపాలని కోరాం. ఓట్ల చోరీ జరుగుతోందని దేశం మొత్తానికి తెలుసు. సీఈసీ కార్యాలయం నుంచే అన్ని చోరీలు జరుగుతున్నాయి. ఓట్ల చోరీలో మోదీ ఆర్కిటెక్.. అమిత్ షా, జ్ఞానేశ్ అమలు చేస్తున్నారు. ఓట్ల చోరీపై ఆలోచించి చర్యలు తీసుకుంటామని రాష్ట్రపతి చెప్పారు'' అని రాహుల్ గాంధీ అన్నారు. రాష్ట్రపతి ముర్ముకు మెమోరాండం ఇచ్చామని, ఓటు చోరీకి సంబంధించి వివరించామని ఖర్గే మీడియాకు తెలిపారు. దీనిపై సంబంధిత వర్గాలతో మాట్లాడతానని రాష్ట్రపతి చెప్పినట్లు



ఆయన పేర్కొన్నారు. ''హరియాణా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బిహార్, దిల్లీ, పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయి. ఈవీఎంలు, ఓటర్ల జాబితాలను భాజపా తారుమారు చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి. సీఈసీ, ఎన్నికల కమిషనర్లకు జీవితకాల రక్షణ కల్పించే 2023 చట్టాన్ని రద్దు చేయాలి. సర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 13.30 కోట్ల మంది పేర్లను వెంటనే తిరిగి చేర్చాలి. ఓట్ల చోరీకి సంబంధించి ఆధారాలు సమర్పించిన గత రెండేళ్ల అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలి. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తక్షణమే జోక్యం చేసుకోవాలి'' అని కూటమి నేతలు రాష్ట్రపతికి విజ్ఞప్తి చేశారు.

## అన్ని అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్న అమిత్ షా.. భద్రతా వలయంలో ఢిల్లీ!

- **సీఈసీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల భారీ నిరసనలకు పిలుపు**
- **ఢిల్లీలో 20 వేల మంది బలగాలతో కఠిన భద్రతా ఏర్పాట్లు**
- **57 మెట్రో స్టేషన్ల మూసివేయాలన్న పోలీసులు.. పలు రైళ్ల సర్వీసులు రద్దు**
- **జంతర్ మంతర్ వద్ద నిరసనకు పోలీసుల అనుమతి నిరాకరణ**
- **పరిస్థితిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉన్నతస్థాయి సమీక్షలు**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ, ప్రతిపక్ష ఇండియా కూటమి తలపెట్టిన భారీ నిరసనల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీ కట్టుదిట్టమైన భద్రతా వలయంలోకి వెళ్లింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా



కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. 20,000 మందికి పైగా పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించి, దేశ రాజధానిలో భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన అధికారిక పర్యటనలు, అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్నారు. గత రెండు రోజులుగా ఆయన ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, భద్రతా చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు, ఈరోజు జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన నిరసన ప్రదర్శనకు పోలీసులు అనుమతి నిరాకరించారు. భద్రతా చర్యల్లో భాగంగా, ఢిల్లీలోని 57 మెట్రో స్టేషన్లను రెండు రోజుల పాటు మూసివేయాలని పోలీసులు మెట్రో అధికారులను కోరారు. అలాగే, న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ స్టేషన్లకు వచ్చే పలు రైళ్లను ఈరోజు రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. జంతర్ మంతర్ పరిసరాల్లో సీసీటీవీలు, ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలతో నిఘాను కట్టుదిట్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నివాసం, ఈసీ కార్యాలయం వద్ద ఇప్పటికే ఉన్న జడ్+ భద్రతతో పాటు భారీగా భద్రతను పెంచారు. ఇదిలా ఉండగా, ఢిల్లీకి వస్తున్న తమ కార్యకర్తలను నాగ్‌పుర్, భోపాల్ వంటి నగరాల్లోనే పోలీసులు అడ్డుకుంటున్నారని సీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా పోస్టులపై కూడా ప్రత్యేక నిఘా పెట్టినట్లు అధికారులు వెల్లడించారు.

## సీజేపీ నిరసనల ఎఫెక్ట్.. దిల్లీలో మూతపడే 57 మెట్రో స్టేషన్లు ఇవే..

దిల్లీ: సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఆందోళనల నేపథ్యంలో దిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. భద్రతాపరమైన కారణాల దృష్ట్యా నేటి రాత్రి (శుక్రవారం) 9గంటల నుంచి తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు 57 మెట్రో స్టేషన్లలో ప్రవేశ, నిష్క్రమణ గేట్లు మూసివేస్తున్నట్లు తెలిపింది. న్యూదిల్లీ మెట్రో



స్టేషన్ మినహా ఆయా మెట్రో స్టేషన్లంటిలోనూ ఇంటర్‌ఛేంజ్ సదుపాయం అందుబాటులో ఉంటుందని పేర్కొంది.

## ఉప పోరు.. తమిళనాట టీవీకే, బెంగాల్‌లో భాజపా హవా

తమిళనాడులో రెండు శాసనసభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో విజయ్ పార్టీ హవా కొనసాగించింది. మధురాంతకంలో టీవీకే అభ్యర్థి మరగతం కుమారవేల్, ధారాపురంలో సత్యభామ విజయం సాధించారు. గత ఎన్నికల్లో అన్నాడీఎంకే నుంచి గెలిచి.. ఆ తర్వాత టీవీకేలో చేరిన ఈ మహిళా నేతలు తాజా ఉప ఎన్నికల్లోనూ విజయం సాధించడం విశేషం. ఈ రెండు స్థానాల్లోనూ డీఎంకే రెండో స్థానంలో నిలవగా అన్నాడీఎంకే మూడో స్థానానికి పరిమితమైంది. పశ్చిమ బెంగాల్‌లోని రెజినగర్‌లో భాజపా అభ్యర్థి శంఖారవ్ సర్కార్, నందిగ్రామ్‌లో హసిరానీ రత్ ఘన విజయం సాధించారు. ప్రత్యర్థిపై సర్కార్ 72వేలకు పైగా మెజార్టీ సాధించగా.. లక్షకుపైగా ఓట్లతో హసిరానీ గెలుపొందారు. పుదుచ్చేరిలోని తట్టంచావడి అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరగ్గా.. ఆల్ ఇండియా ఎన్.ఆర్ కాంగ్రెస్ అభ్యర్థి అశోక్ ఆనంద్ గెలిచారు. వీటితోపాటు అస్సాంలోని నాగావ్ పార్లమెంట్ స్థానానికి జరిగిన



ఉప ఎన్నికల్లో అధికార భాజపా భారీ మెజార్టీ దిశగా దూసుకెళ్తోంది.




# మస్క్ ఆరోపణల్లో నిజమెంత..? 'స్టార్‌లింక్' ఎంట్రీతో సవాళ్లేంటి?




స్టార్‌లింక్.. ఇప్పుడు నెట్టింట మార్మోగుతున్న పేరు ఇది! భారత్‌లో తమ ప్రవేశాన్ని కావాలనే అడ్డుకుంటున్నారంటూ ఓవైపు ఎలాన్ మస్క్ ఆరోపణలు.. నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే అనుమతులంటూ కేంద్రం చెబుతోన్న సమాధానంతో ఈ శాటిలైట్ కమ్యూనికేషన్‌పై పెద్ద చర్చే నడుస్తోంది. మరి మస్క్ అంటున్నట్లు ఇది కేవలం టెలికాం కంపెనీల మధ్య పోటీ మాత్రమేనా? భారతీయులకు 'స్టార్‌లింక్' తరహా సేవల అవసరం నిజంగానే ఉందా? మస్క్ ఎంట్రీ వెనుక ఉన్న సవాళ్లేంటి..?

**వివాదం ఇదీ..**

స్టార్‌లింక్ సంస్థతో ప్రపంచవ్యాప్తంగా 165కు పైగా దేశాల్లో ఉపగ్రహ కమ్యూనికేషన్ సేవలను అందిస్తోన్న అపర కుబేరుడు ఎలాన్ మస్క్.. భారత్‌లోకి ప్రవేశించాలని ఎంతోకాలంగా ప్రయత్నిస్తున్నారు. అందుక్కారణం చైనా తర్వాత మన దేశమే అతిపెద్ద టెలికమ్యూనికేషన్ మార్కెట్ కావడమే. ఇక్కడ 100 కోట్లకు పైగా మొబైల్ చందాదారులున్నారు. ఈ క్రమంలోనే భారతీయ కమ్యూనికేషన్ దిగ్గజాలైన భారతీ ఎయిర్‌టెల్, జియోతో మస్క్ ఒప్పందాలు చేసుకున్నారు. అయితే, తుది అనుమతులు రావడంలో జాప్యంపై ఇటీవల మస్క్ చేసిన ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. తమ రాకను కొంతమంది పెద్దలు ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటున్నారని ఆయన ఆక్షేపించడం సంచలనం సృష్టించింది. వాస్తవానికి దేశంలో శాట్‌కామ్ సేవలను ప్రారంభించేందుకు స్టార్‌లింక్, జియో శాట్‌కామ్, యుటెల్‌శాట్ వన్‌వెబ్‌కు ప్రభుత్వం ఇప్పటికే లైసెన్సులు మంజూరు చేసింది. ఇందులో దేనికి కూడా ఇప్పటివరకు తుది అనుమతులు లభించలేదు. భద్రతాపరమైన తనిఖీలన్నీ పూర్తయిన తర్వాతే కార్యకలాపాలు ప్రారంభించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తామని కేంద్రం చెబుతోంది. దీంతో ఈ వ్యవహారం చర్చనీయాంశమైంది.

*** శాటిలైట్ కమ్యూనికేషన్ అవసరమేంటి?**

మారుమూల ప్రాంతాలకు ఉపగ్రహ టెలిఫోన్, ఇంటర్నెట్ సౌకర్యం అందించడానికి ఉపగ్రహ టెలికాం సౌకర్యం కీలకం. మన దేశంలో 5జీ విస్తృతంగా అందుబాటులో ఉన్నా.. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. పర్వత ప్రాంతాలు, దట్టమైన అడవుల్లో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంటోంది. దీంతో ఆయా ప్రదేశాల్లో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు సమన్వయం లోపిస్తోంది. దాన్ని శాటిలైట్ కమ్యూనికేషన్ పూడ్చే అవకాశం ఉంది. ఇక, జాతీయ భద్రత, రక్షణతో పాటు శాస్త్ర పరిశోధనలు, బ్రాడ్‌కాస్టింగ్ సేవలకూ శాటిలైట్ టెలికాం సౌకర్యం ఉపయోగపడుతుంది. గ్రామాల్లో బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సేవల కోసం టవర్లు, ఇతర నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. వాటి అవసరం లేకుండానే స్టార్‌లింక్ ఉపగ్రహాల ద్వారా టెలికాం సేవలు అందించవచ్చు.

**పోటీకి మించి..**

ఏ రంగంలోనైనా పోటీ ఉంటే కస్టమర్లకు మెరుగైన సేవలు అందుతాయి. అందువల్ల స్టార్‌లింక్‌ను దేశంలోకి ఆహ్వానించడం తప్పుడు నిర్ణయమేం కాదు. అయితే, అది మన చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా ఉండటం మాత్రం అత్యావశ్యకమని నిపుణులు చెబుతున్నారు. దీనికి కారణం.. స్టార్‌లింక్ మన కమ్యూనికేషన్ సేవలపై గుత్తాధిపత్యం సాధించే అవకాశం ఉండటమే..! ఇక, స్టార్‌లింక్‌తో భారత పౌరుల సమాచారం అగ్రరాజ్యానికి చేరే అవకాశం ఉండటం వల్ల.. మన దేశ భద్రతకూ ఇది సవాలేనని చెప్పొచ్చు. ఇందుకు ఉక్రెయిన్, ఇరాన్‌లో చోటుచేసుకున్న పరిస్థితులే ఓ ఉదాహరణ. రష్యాతో యుద్ధంతో ఉక్రెయిన్‌లో గ్రౌండ్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్ తీవ్రంగా దెబ్బతింది. ఆ సమయంలో కీవ్ దళాలు స్టార్‌లింక్ సేవల మీద ఆధారపడక తప్పలేదు. అది అగ్రరాజ్యానికి కలిసొచ్చింది. ఉక్రెయిన్‌లోని అరుదైన ఖనిజ వనరుల్లో 50 శాతాన్ని అమెరికాకు ఇవ్వకపోతే స్టార్‌లింక్ సేవలు నిలిపేస్తామని బెదిరించినట్లు గతంలో వార్తలు వచ్చాయి.

ఇక, ఈ ఏడాది ఆరంభంలో ఇరాన్‌లో పెద్ద ఎత్తున ఆందోళనలు చోటుచేసుకున్నాయి. ఆ సమయంలో ఉద్రిక్తతలను అదుపు చేసేందుకు ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినా.. స్టార్‌లింక్ సాయంతో ఆందోళనకారులు పరస్పరం కమ్యూనికేషన్ కొనసాగించారు. భారత్ లాంటి అధిక జనాభా ఉన్న దేశంలో అలాంటి పరిస్థితి తలెత్తితే.. పరిణామాలు తీవ్రంగా ఉంటాయని నిపుణులు భావిస్తున్నారు.

చివరగా.. భారత్‌కు శాటిలైట్ కనెక్టివిటీ అవసరమే. అందులో పోటీ, ప్రత్యామ్నాయ వ్యవస్థలూ ముఖ్యమే. అయితే, ఆ అనుసంధానత మన సార్వభౌమత్వానికి, ఆవిష్కరణలకు ముప్పుగా మారకూడదనేది విశ్లేషకుల మాట..!

## అమెరికాకు మనం అక్కర్లేదు..
# తిరిగొచ్చేయండి: శ్రీధర్ వెంబు



చెన్నై: టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ వంటి సంస్థలను పర్మినెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ నుంచి సస్పెండ్ చేస్తూ ట్రంప్ సర్కారు తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఉపాధి ఆధారిత గ్రీన్‌కార్డు పొందడంలో హెచ్ 1బీ వర్కర్లకు దోహదపడే ఈ పర్మ్ ప్రోగ్రామ్ నుంచి ఈ కంపెనీలను సస్పెండ్ చేయడంతో.. విదేశీ ఉద్యోగులకు కంపెనీలు శాశ్వత నివాసం స్పాన్సర్ చేయడం కష్టమవుతుంది. ఈ నేపథ్యంలో జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికాకు మన అవసరం లేదని, అక్కడి భారతీయులు తిరిగి స్వదేశానికి వచ్చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ''అమెరికా సాంకేతిక ప్రగతిలో భారతీయులు కీలక పాత్ర పోషించారు. అయితే, ఇప్పుడు అక్కడ ఒక పెద్ద వర్గానికి ఇక భారతీయుల అవసరం లేదనిపిస్తోంది. వీసాపై ఉంటూ ఇన్నాళ్లూ కష్టపడి నిర్మించుకున్న జీవితాన్ని వదిలిరావడం ఒక విధంగా బాధాకరమైన విషయం. అయినా ఇదే సరికొత్త భవిష్యత్‌కు నాంది కావాలి. 'వెనక్కి రండి.. భారత్‌ను నిర్మిద్దాం'' అని శ్రీధర్ వెంబు భారతీయులకు పిలుపునిచ్చారు. విదేశీ ఉద్యోగులకు శాశ్వత నివాస హోదా (గ్రీన్‌కార్డ్) కల్పించేందుకు ఉద్దేశించిన PERM వ్యవస్థను కొన్ని కంపెనీలు దుర్వినియోగం చేశాయని ఆరోపిస్తూ అమెరికా కార్మిక శాఖ 8 కంపెనీలపై సస్పెన్షన్ వేటు వేసింది. ఈ సస్పెన్షన్ అమల్లో ఉన్నంత కాలం ఆయా కంపెనీల నుంచి కొత్త దరఖాస్తులను స్వీకరించబోమని, పెండింగ్‌లో ఉన్నవాటిని కూడా నిలిపివేస్తున్నామని ట్రంప్ సర్కారు స్పష్టం చేసింది. దీనివల్ల ప్రస్తుతం హెచ్ 1 బీ వీసాలు రద్దు కానప్పటికీ.. శాశ్వత నివాసం ఏర్పరుచుకోవాలని కలలు కనేవారికి ఇది గట్టి ఎదురుదెబ్బ కానుంది.




# గ్రీన్ కార్డ్ ప్రోగ్రామ్ సస్పెన్షన్.. టీసీఎస్ ఏమందంటే..?

అర్హులైన విదేశీ కార్మికులకు గ్రీన్‌కార్డు కోసం కంపెనీలు స్పాన్సర్ చేయడానికి వీలు కల్పించే పర్మ్ కార్యక్రమం నుంచి తమను సస్పెండ్ చేయడంపై ఐటీ దిగ్గజం టీసీఎస్ స్పందించింది. ఈ నిర్ణయం తమ సంస్థకు సంబంధించిన నియామక వ్యూహాన్ని, కస్టమర్లకు అందించే సేవలపై ఎలాంటి ప్రభావం చూపదని భావిస్తున్నట్లు చెప్పింది. శుక్రవారం స్టాక్ మార్కెట్ ఫైలింగ్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. గత రెండేళ్లుగా తమ పర్మ్ దరఖాస్తులు చాలా స్వల్పంగా.. సింగిల్ డిజిట్‌కే పరిమితమై ఉన్నాయని టీసీఎస్ తెలిపింది. అందుకే ఈ నిర్ణయం తమను ఎక్కువగా ప్రభావితం చేయదని చెప్పింది. అమెరికా కార్మిక శాఖ జారీ చేసిన ఆదేశాలను పాటిస్తామని చెప్పింది. అలాగే తన కంపెనీ వ్యూహాలను పునరుద్ఘాటించింది. రాబోయే ఐదేళ్లలో అమెరికాలోనే 15,000 మంది స్థానికులను ఉద్యోగాల్లోకి తీసుకోనున్నట్లు వెల్లడించింది. ఇన్ఫోసిస్, విప్రో, కాగ్నిజెంట్ వంటి ఇతర కంపెనీలు తమ హెచ్ 1బీ ఉద్యోగులు తమ వద్దే ఉండేలా చూసుకునేందుకు గ్రీన్‌కార్డ్ ప్రాసెసింగ్పై కొంతవరకు ఆధారపడతాయి. కానీ టీసీఎస్ ఇప్పటికే స్థానికులను నేరుగా నియమించుకోవడం ప్రారంభించింది. దీంతో ఈ సస్పెన్షన్ ప్రభావం దానిపై ఎక్కువగా ఉండదని తెలుస్తోంది. హెచ్ 1బీ వీసాలపై అమెరికాకు పంపడానికి బదులు కీలకమైన ప్రాజెక్టులను భారత్‌లోని తమ సెంటర్ల నుంచే నిర్వహిస్తుండటం ఇంకో కారణం.

# పదేళ్ల తర్వాత రీఎంట్రీ.. డకౌట్‌తో ఆసీస్ ఓపెనర్ చెత్త రికార్డు

దాదాపు పదేళ్ల తర్వాత జాతీయ జట్టులోకి పునరాగమనం చేసిన ఆస్ట్రేలియా ఓపెనర్ నిక్ మాడిసన్ ఓ చెత్త రికార్డును ఖాతాలో వేసుకున్నాడు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో 33 బంతులు ఆడిన మాడిసన్ పరుగుల ఖాతా కూడా తెరవలేదు. అత్యధిక బంతులు ఎదుర్కొని డకౌట్ అయిన ఆసీస్ ఓపెనర్‌గా నిలిచాడు. 21వ శతాబ్దంలోనే అత్యంత చెత్త రికార్డును నమోదు చేశాడు. 2016లో దక్షిణాఫ్రికాపైనే అరంగేట్రం చేసిన అతడు.. అదే ఏడాది పాకిస్థాన్‌తో తన చివరి టెస్టును ఆడాడు. అప్పట్నుంచి అతడికి అవకాశాలే రాలేదు. ఇప్పుడు పునరాగమనం కూడా సఫారీ జట్టుపైనే కావడం గమనార్హం. ఇప్పటి వరకు నాలుగు టెస్టుల్లో 27 పరుగులు మాత్రమే చేశాడు.

**అంతా 30+ ఆటగాళ్లే..**

టెస్టు చరిత్రలో తొలిసారి ఆస్ట్రేలియా ఓ టెస్టులో 30+ వయసు కలిగిన ప్లేయర్లతో బరిలోకి దిగింది. నాథన్ లయన్ (38) అందరికంటే ఎక్కువ వయస్కుడు కావడం గమనార్హం.

**తొలి టెస్టులో టాప్ ఆర్డర్ విఫలం**

దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో టాస్ నెగ్గిన ఆస్ట్రేలియా (SA vs AUS) బ్యాటింగ్ ఎంచుకుంది. ఆ నిర్ణయం పెద్ద తప్పు అని ఆసీస్ బ్యాటింగ్‌ను చూస్తే అర్థమవుతోంది. టాప్ ఆర్డర్ విఫలం కావడంతో వందలోపే కీలకమైన నాలుగు వికెట్లను చేజార్చుకుంది. ఓపెనర్లు నిక్ మాడిసన్ (0) డకౌట్ కాగా.. ట్రావిస్ హెడ్ (9) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. మార్నస్ లబుషేన్ (37), స్టీవ్ స్మిత్ (25) ఆదుకొనేందుకు ప్రయత్నించినా స్వల్ప వ్యవధిలో వారిద్దరూ పెవిలియన్‌కు చేరారు.







## కోహ్లీ ఇప్పటి ఫామ్..
# అత్యంత ప్రమాదకరం: ఏబీడీ ఆసక్తికర వ్యాఖ్యలు




టీమ్ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఆడుతున్నది ఒక్క ఫార్మాటే. దానికి కూడా త్వరలోనే వీడ్కోలు పలికేస్తాడంటూ ఊహాగానాలు వినిపిస్తోన్న వేళ.. ఇటీవల శతకంతో రిటైర్మెంట్ వార్తలకు చెక్ పెట్టాడు కింగ్. ఈ మధ్య భీకర ఫామ్‌తో దూసుకుపోతున్న కోహ్లీపై తన స్నేహితుడు, దక్షిణాఫ్రికా మాజీ దిగ్గజం ఏబీ డివిలియర్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. విరాట్ ప్రస్తుత ఫామ్ అత్యంత ప్రమాదకరమని అన్నాడు. అతడిలో ఎవరికీ తెలియని మరో కోణం ఉందన్నాడు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కోహ్లీ గురించి ఏబీడీ మాట్లాడాడు. 2016 నాటితో పోలిస్తే ఇప్పుడు విరాట్‌లో వచ్చిన మార్పులను ప్రస్తావించాడు. ఆ విషయాలను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ తమ వెబ్‌సైట్‌లో పంచుకుంది. ''నాకు తెలిసి కోహ్లీ ఇప్పుడు గతంలో కంటే చాలా మెరుగ్గా ఆడుతున్నాడు. ఎందుకంటే అతడు ఇప్పుడు స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఉన్నాడు. గతేడాది జరిగిన ఐసీసీ ఛాంపియన్స్‌ట్రోఫీ తర్వాత నుంచే ఈ మార్పు నేను గమనిస్తున్నా. విరాట్‌లో ప్రజలకు, అభిమానులకు తెలియని మరో కోణం ఉంది. ఇప్పుడా కోణం మరింతగా బయటకు వస్తోంది. మైదానంలో తన అత్యుత్తమ టాలెంట్‌ను ప్రదర్శించి.. ప్రపంచవ్యాప్తంగా అభిమానులను మరింత అలరించాలనే విషయం అతడికి అర్థమైంది. అది చివరిసారి కావొచ్చు..! మరో రెండేళ్లు లేదంటే ఐదేళ్లు కావొచ్చు..!'' అని ఏబీడీ వ్యాఖ్యానించాడు. ''అతడు ఎంతకాలం ఆడుతాడో నాకు తెలియదు. కానీ, ఇప్పుడు మరింత ప్రమాదకారిగా మారాడన్నది మాత్రం అర్థమైంది. విరాట్ దూకుడుగా ఆడితే అతడిని అడ్డుకోవడం అసాధ్యం. ఇదిలాగే కొనసాగితే.. 2027 వరల్డ్ కప్‌లో టీమ్ఇండియాపై అతడు భారీ ప్రభావమే చూపించగలడు. విరాట్‌తో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం యువ ఆటగాళ్లకు అత్యుత్తమ అవకాశం. అతడి నుంచి వారు ఎంతో నేర్చుకోవచ్చు'' అని డివిలియర్స్ వివరించాడు.

## బుమ్రాను వద్దనుకుంది..
# నా మాట వినుంటే ఐదు కప్పులు ఆర్సీబీవే: పార్థివ్



ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండు సార్లు విజేతగా నిలిచింది. కానీ, తన సలహాను పాటించి ఉంటే ఇప్పటికే ఐదు కప్పులను సొంతం చేసుకొని ఉండేదని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ పార్థివ్ పటేల్ వ్యాఖ్యానించాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పార్థివ్ 2014 వేలం సమయంలో ఏం జరిగిందో వెల్లడించాడు. జస్‌ప్రీత్ బుమ్రాను తీసుకొనే అవకాశం వద్దనుకొని భారీ మూల్యం చెల్లించుకున్నట్లు పేర్కొన్నాడు. ''2014 మెగా వేలంలో నన్ను తొలి రోజే లంచ్ బ్రేక్‌కు ముందే జట్టులోకి తీసుకున్నారు. ఆర్సీబీ నుంచి నాకు మెసేజ్ వచ్చింది. అప్పుడు మేనేజ్‌మెంట్ దృష్టికి ఓ విషయం తీసుకొచ్చా. ఓ అద్భుతమైన ప్లేయర్ ఉన్నాడు. అతడిని తీసుకొనేందుకు చూడండి అని చెప్పా. అయితే, వారికి నేను చెప్పిన విధానం సరిగా అనిపించలేదేమో.. బుమ్రాలాంటి బౌలర్ ఏం చేస్తారు? అన్నట్లుగా వారి సమాధానం ఉంది. ఇదే విషయాన్ని నేను ఓ బ్రాడ్‌కాస్ట్‌లో మాట్లాడా. అయితే, నేను అలా మాట్లాడి ఉండాల్సింది కాదు. ఆ తర్వాత 'ఎక్స్'లోనూ స్పందించా. నేను అలా చేసి ఉండకూడదు. ఆ దశలో బుమ్రాను కొనుగోలు చేయడం సరైన నిర్ణయం అవుతుందని ఆర్సీబీ భావించలేదు. నా వ్యాఖ్యలు వైరల్ కావడంతో.. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుకు కొందరు తమకు నచ్చిన విధంగా అపార్థాలను అంటగట్టారు'' అని పార్థివ్ తెలిపాడు. ఐపీఎల్ 2019 సీజన్ కంటే ముందు విరాట్ కోహ్లీ స్థానంలో జట్టు కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాలని మేనేజ్‌మెంట్ తనను సంప్రదించిందని పార్థివ్ పటేల్ వెల్లడించారు. అప్పట్లో జట్టు ప్రధాన కోచ్‌గా ఉన్న గ్యారీ కిర్‌స్టన్, మెంటార్ ఆశిష్ నెహ్రా తనకు ఈ విషయం చెప్పినట్లు ఆయన గుర్తుచేసుకున్నారు.

# పాక్ పోయె.. బంగ్లా వచ్చె.. భారత్‌లో హాకీ ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ



హాకీ ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ 2026 టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. అక్టోబర్ 27 నుంచి నవంబర్ 5 వరకు పంజాబ్‌లోని జలంధర్, మొహాలీ వేదికగా ట్రోఫీ (Asian Champions Trophy 2026) జరగనుంది. తాజాగా టోర్నీ షెడ్యూల్‌ను హాకీ ఇండియా విడుదల చేసింది. మొత్తం ఆరు దేశాలు బరిలోకి దిగుతున్నాయి. పాకిస్థాన్‌కు మాత్రం అవకాశం దక్కలేదు. దాని స్థానంలో బంగ్లాదేశ్ ఆడుతోంది. భారత్, బంగ్లాదేశ్, మలేసియా, జపాన్, కొరియా, చైనా పోటీ పడుతున్నాయి. పాక్ లేకపోవడానికి కారణమదే.. భారత్‌లో మ్యాచ్‌లను ఆడేందుకు పాకిస్థాన్ హాకీ ఫెడరేషన్ (పీహెచ్‌ఎఫ్) నిరాకరించింది. ఈ టోర్నీని వేరే దేశానికి తరలించాలని.. లేదా తమ జట్టు ఆడే మ్యాచులను తటస్థ వేదికను కేటాయించాలని డిమాండ్ చేసింది. అయితే, పాక్ విజ్ఞప్తిని ఆసియా హాకీ ఫెడరేషన్ తిరస్కరించింది. రిజ్వర్ టీమ్‌గా ఉన్న బంగ్లాదేశ్‌కు పాక్ స్థానంలో ఛాన్స్ దక్కింది.

**భారత్ మ్యాచులివీ..**

అక్టోబర్ 27: బంగ్లాదేశ్‌తో రాత్రి 7 గంటలకు
అక్టోబర్ 29: చైనాతో రాత్రి 7 గంటలకు
అక్టోబర్ 30: జపాన్‌తో రాత్రి 7 గంటలకు
నవంబర్ 1: మలేసియాతో రాత్రి 7 గంటలకు
నవంబర్ 2: కొరియాతో రాత్రి 7 గంటలకు



# టాలీవుడ్‌కు జాన్వీకపూర్ గుడ్‌బై?

జాన్వీకపూర్‌కు టాలీవుడ్ అంతగా అచ్చిరాలేదు. ఇప్పటివరకు తెలుగులో దేవర, పెద్ది సినిమాలు చేసింది. వీటిలో ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లతో జోడీకట్టింది. స్టార్ హీరోలతో సినిమాలు చేశానన్న పేరు తప్ప జాన్వీ కెరీర్‌కు ఏ విధంగా ఉపయోగపడలేదు. ఈ రెండు సినిమాల్లో జాన్వీకపూర్ పాత్రలపై దారుణంగా విమర్శలొచ్చాయి. కేవలం గ్లామర్ యాంగిల్‌లోనే ఆమెను దర్శకులు ఈ సినిమాలో చూపించారు. దీంతో టాలీవుడ్ సినిమాలకు కొన్నేళ్ల పాటు దూరంగా ఉండాలని జాన్వీ నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. తెలుగు సినిమాల ఆఫర్లను రిజెక్ట్ చేస్తోన్నట్లు చెబుతోన్నారు.





# 20న ఇమాన్వీ ఫస్ట్ లుక్ ?

ప్రభాస్ బర్త్‌డే సందర్భంగా ఫౌజీ టీమ్ ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఇవ్వబోతున్నట్లు సమాచారం. అక్టోబర్ 23 ఫౌజీ టీజర్‌ను రిలీజ్ చేయబోతున్నట్లు తెలిసింది. ఈ టీజర్ కంటే మూడు రోజుల ముందు ఇమాన్వీ ఫస్ట్ లుక్‌ను కూడా విడుదల చేసే అవకాశం ఉందని అంటున్నారు. అక్టోబర్ 20న ఇమాన్వీ బర్త్‌డే ఉంది. అదే రోజు ఫౌజీలోఆమె లుక్‌తో పాటు హీరోయిన్ పాత్ర ఎలా ఉండబో తుందన్నది క్లారిటీ ఇవ్వబోతున్నట్లు తెలిసింది. ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతోన్న మూవీ ఫౌజీ. దాదాపు నాలుగు వందల కోట్ల బడ్జెట్‌తో హిస్టారికల్ యాక్షన్ ఎం టర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఫౌజీ చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ప్రభాస్ బర్త్‌డే సందర్భంగా అక్టోబర్ 23న ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

# అలా అయితే ముందుకెళ్లలేం

సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు, కామెంట్స్‌ను అతిగా పట్టించుకుంటే మన ఆత్మవిశ్వాసం దెబ్బతింటుందని బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ పేర్కొంది. ఇతరులను మెప్పించేందుకు ప్రయత్నించడం కంటే మనల్ని మనం అంగీకరించడమే ముఖ్యమని తెలిపింది. జీవితంలో ఎదురయ్యే ప్రతి విమర్శకు స్పందిస్తూ పోతే సొంత నిర్ణయాలు తీసుకోలేమని అభిప్రాయం వ్యక్తం చేసింది. సోషల్ మీడియాలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు మన ఆత్మగౌరవాన్ని ప్రభావితం చేయకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఇటీవల భర్త విక్కీ కౌశల్‌తో కలిసి అంబానీ కుటుంబం నిర్వహించిన గణేశ్ చతుర్థి వేడుకలకు కత్రినా హాజరైంది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ క్రమంలో ప్రసవం తర్వాత ఆమె బరువు పెరగడంపై కొందరు నెటిజన్లు విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలోనే కత్రినా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



# డిసెంబర్ 4న థియేటర్లలోకి అలియాస్ రుక్మిణి

నితిన్, ఆఫీయి సయీద్ హీరోహీరోయినట్లుగా హీరో నాని నిర్మాణంలో రూపొందుతోన్న అలియాస్ రుక్మిణి సినిమాను డిసెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు నాని ప్రకటించారు. ఓ కొత్త పోస్టర్‌ను అభిమానులతో పంచుకున్నారు. ఇందులో భుజానికి బ్యాగ్ తగిలించుకొని జనాల మధ్యలో నుంచి నడుచుకుంటూ వస్తూ సింపుల్ లుక్‌లో నితిన్ కనిపిస్తున్నారు. ఈ పోస్టర్‌లో ఓ అమ్మాయి షాడో ఉండటం ఆసక్తిని పంచుతోంది. ఆమె ఎవరన్నది రివీల్ చేయలేదు.



# డ్యాన్సర్స్ అసోసియేషన్ ఎన్నికలకు హైకోర్టు బ్రేక్



తెలుగు ఫిలిం అండ్ టీవీ డాన్సర్స్ అండ్ డాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్‌లోని సమస్యలు పరిష్కారం కాకుండా అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించడానికి వీలులేదని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. అక్టోబర్ 11న జరగాల్సిన ఎన్నికలను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు నిలిపివేసింది. ఎన్నికలకు ముందే వివాదాన్ని విచారించకుండా, ఎన్నికల అనంతరం విచారణకు తేదీ నిర్ణయించడంపై ట్రయల్ కోర్టు తీరును తప్పుబట్టింది.

## ఈ వారం ఓటీటీలో రిలీజైన సినిమాలు, వెబ్‌సిరీస్‌లు ఇవే

| | |
|---|---|
| **నెట్‌ఫ్లిక్స్** | మండాడి (తమిళ్)<br>ఎపిక్ (తెలుగు)<br>ప్రథమ దృష్ట్యకుట్టతార్ (మలయాళం)<br>రిపోర్టింగ్ లైవ్ (హిందీ)<br>అన్‌ఫర్‌గెటెబుల్ వెబ్‌సిరీస్ (ఇంగ్లిష్) |
| **అమెజాన్ ప్రైమ్:** | ఖలీఫా (మలయాళం)<br>వీడియో (కన్నడ)<br>అవారాపన్ 2 (హిందీ)<br>స్పైడర్ మ్యాన్ బ్రాండ్ న్యూ డే (ఇంగ్లిష్)<br>బ్లాక్ జాంబీ (ఇంగ్లిష్)<br>కాలనీ (ఇంగ్లిష్) |
| **ఆహా ఓటీటీ :** | మారెమ్మ (తెలుగు)<br>పారిస్ కేఫ్ (తమిళం) |
| **సోనీ లివ్ ఓటీటీ:** | ది ఐస్ వెబ్‌సిరీస్ (మలయాళం) |
| **ఈటీవీ విన్ :** | లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ (తెలుగు) |
| **సన్ నెక్స్ట్ ఓటీటీ :** | లైఫ్ టుడే |